



అలమూరు మండలం చెముడులంకవద్ద ప్రారంభమైన నేషనల్ హైవే సర్వీసు రోడ్డు పనులు

సఖినేటిపల్లి రేవులో రాకపోకలు ప్రారంభం

అంతర్వేది,సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వరదల కారణంగా సఖినేటిపల్లి, నర్సాపురం రేవులో కొన్నిరోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి.వరద తగ్గడంతో ఆదివారంనుంచి పంటు ప్రయాణాలు సాగుతున్నాయి. లంకగ్రామాలు కావడంతో వరద పెరిగినప్పుడల్లా ప్రమాదాలుజరగకుండా పంటు నిలిపివేసి వరద తగ్గిన తర్వాత ప్రయాణాలు సాగిస్తున్నారు. చించినాడ వంతెన మరమ్మతుల నేపథ్యంలో భారీ వాహనాలపై ఆంక్షలతో ఈరేవుమీదుగానే ప్రజలు ప్రయాణాలు సాగిస్తున్నారు.



రోళ్లపాలెం పీఏసీఎస్‌లో రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

పంట సమృద్ధిగా ఎదిగేందుకు కాంప్లెక్సు ఎరువులు దోహదం : జేసీ

అమలాపురంరూరల్, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): రైతులు పండించే పంటలు సమృద్ధిగా ఎదిగేందుకు కాంప్లెక్సు ఎరువులు ఎంతో దోహదపడతాయని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. మనిషి ఎదుగుదలకు ఏ విధంగా న్యూట్రియన్స్ అవసరమో అదేలా మొక్కలకు ఎన్పీకే వంటి కాంప్లెక్సు ఎరువులు కూడా అంతే అవసరమని ఆమె అన్నారు. యూరియాతో పంటకు నైట్రోజన్ ఒక్కటే అందుతుందని, నైట్రోజన్, పాస్ఫరస్, పొటాష్ కలిసిన కాంప్లెక్సు ఎరువులు వాడితే పంట ఎదుగుదల ఎంతో బాగుంటుందన్నారు. రోళ్లపాలెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం వద్ద ఆదివారం సహకార సంఘ అధ్యక్షుడు మట్టా మహలక్ష్మిప్రభాకర్ అధ్యక్షతన సమీప గ్రామాల రైతులతో జరిగిన అవగాహన సదస్సుకు జేసీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఒకేసారి రైతుల్లో మార్పు తీసుకురావాలంటే ఎన్నో అనుమానాలు ఉంటాయని, వాటన్నింటినీ నివృత్తి చేసేందుకు అధికారులు ఎప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. రైతులకు పూర్తిస్థాయిలో నానో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భూసార పరీక్షలు జరిపి ఎంతకాలమైందని రైతులను జేసీ ప్రశ్నించారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో భూసార పరీక్షలు నిర్వహించి కార్డులు అందించారని, మళ్లీ ఇంతవరకు ఇవ్వలేదని వారు బదులిచ్చారు. మట్టి పరీక్షల ద్వారా భూసారం ఎలాఉందో తెలుసుకుని అందుకు అనుగుణంగా ఎరువులను వాడాలని ఆ దిశగా చర్యలు చేపడతామన్నారు. ఎరువుల సమస్యలపై కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమును ఏర్పాటుచేశామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు గంధం కెనడీ, తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్, సర్పంచ్ పొణకల గణేష్, మాజీ సర్పంచ్ రంకిరెడ్డి సూర్యనారాయణ, ఎంపీటీసీ మోటూరి కనకదుర్గ, మండల వ్యవసాయాధికారి కె.ప్రవీణ్, ఉద్యానశాఖ అధికారి దిలీప్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ థెరిసా పాల్గొన్నారు.



అప్పనపల్లి బాలబాలాజీ ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకులు

చంద్ర గ్రహణ ప్రభావం

ఆలయాలు మూసివేత

చంద్రగ్రహణ ప్రభావంతో ఆలయాలన్నీ ఆదివారం మూసివేశారు. అంతర్వేది లక్ష్మీనరసింహుడు, ద్రాక్షారామ భీమేశ్వరుడు, వాడపల్లి వెంకన్న, అప్పనపల్లి బాలబాలాజీ ఆలయాలతోపాటు జిల్లాలో మిగితావి కూడా మూసివేయగా సోమవారం సంప్రోక్షణ తర్వాత తెరవనున్నారు. 7



యూరియా ఉందయ్యా!

అధికారుల అంచనాలకు మించి జిల్లాకు సరఫరా

- లక్ష్యం 16,120 మెట్రిక్ టన్నులు
- సరఫరా 21,733 మెట్రిక్ టన్నులు
- అందుబాటులో 919 మెట్రిక్ టన్నులు
- బూస్టర్ డోస్‌తో పెరిగిన డిమాండ్
- రోడ్డెక్కేందుకు వైసీపీ కుట్రలు

వైసీపీది అనవసర రాద్ధాంతం

యూరియాపై వైసీపీ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారు.కొరత ఆపాదిస్తూ అర్థంలేని ఆందోళనలు చేసి రైతులను తప్పుదోవ పట్టించడం తగదు. రైతు సంక్షేమాన్ని విస్మరించింది జగన్ ప్రభుత్వమే. ధాన్యం నిల్వలు కొనుగోలు చేసి కూడా సొమ్ములు చెల్లించలేని వైసీపీ ప్రభుత్వం ఇప్పుడు రైతులపై మొసలి కన్నీరు కారుస్తుంది. జిల్లా వ్యాప్తంగా యూరియా కొరత లేదు. కాంప్లెక్స్ రేట్లు పెరగడంతో రైతులు యూరియా వైపు మళ్లడంతో ఇబ్బంది వచ్చింది.

- ఎం.మహాలక్ష్మిప్రభాకర్,టీడీపీ రైతు సంఘాధ్యక్షుడు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో వ్యవసాయశాఖ అధికారుల అంచనాలకు మించి యూరియాను రైతులకు సరఫరా చేస్తున్నారు. అయినా యూరియా కొరత ఉందంటూ వైసీపీ సహా కొన్ని రాజకీయ పార్టీలు రాద్ధాంతం చేస్తున్నాయి. ఖరీఫ్ 2025 సీజన్‌లో వరి సాగులో యూరియా వినియోగం అధికంగా పెరిగింది.కాంప్లెక్స్ ఎరువుల ధరలు యూరియా ధరలకు మించి ఆరేడు రెట్లు అధికంగా ఉండడంతో రైతులు ప్రధానంగా యూరియాపైనే దృష్టి సారిస్తున్నారు. సోషల్ మీడియాలో వైసీపీ సహా ఇతర పక్షాలు యూరియా కొరత వస్తుందని చేస్తున్న ప్రచారంతో రైతులు కలవరపాటుకు గురై ముందస్తు నిల్వలు చేసుకునే పనిలో నిమగ్నమవుతున్నారు. దీంతో కృత్రిమ కొరత అనివార్యమవుతుంది.

యూరియా బూస్టర్ డోస్..

జిల్లాలో యూరియా వినియోగం ఖరీఫ్ సీజన్‌లో భారీగా పెరిగింది. అందువల్లే కొరత అనివార్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అధిక వర్షాల కారణంగా ఖరీఫ్ నాట్లు వేసే ప్రక్రియలో ఈ సారి మూడో పర్యాయం బూస్టర్ డోస్‌గా యూరియా వినియోగించారు. దీని వల్ల కొరత వచ్చినట్టు భావిస్తున్నారు. రైతులు అవగాహన లోపంతో అవసరానికి మించిన యూరియా కొనుగోలుచేసి నిల్వలు చేయడం వంటి పరిణామాలు మరో కారణంగా భావిస్తున్నారు. ముఖ్యంగా కాంప్లెక్స్ ఎరువులు వినియోగించాలని అధికారులు పదేపదే సూచిస్తున్నప్పటికీ వాటి ధరలు తీవ్రంగా ఉన్నాయి. ఉదాహరణకు 50 కిలోల కాంప్లెక్స్ ఎరువు బస్తా రూ.1850 ధర పలుకుతుంది. అదే 45 కిలోల యూరియా బస్తా రూ.265 ధర పలుకుతుంది. దాంతో చిన్న, సన్నకారు రైతులు అధిక పెట్టుబడులు పెట్టలేక యూరియా వైపు దృష్టి సారిస్తున్నారు. ఎప్పుడూ రెండు పర్యాయాలు మాత్రమే యూరియా వినియోగించే రైతాంగం ఈ సారి అదనంగా బూస్టర్ డోస్ పేరుతో మూడోసారి వినియోగం వల్ల పెరిగింది.

అధికారుల లెక్కకు మించి.. 21,733 మెట్రిక్ టన్నులు సరఫరా

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు ఖరీఫ్ సీజన్‌లో 16,120 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుందని జిల్లా వ్యవసాయశాఖ అంచనాలు రూపొందించింది. అందుకు భిన్నంగా సెప్టెంబరు 4వ తేదీ నాటికి జిల్లాలో 21,733 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశారు. ఈ నెల 5వ తేదీ వరకు జిల్లాలో 20814 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు ఆర్‌ఎస్‌కే, సొసైటీలు, ప్రైవేటు ఎరువుల వ్యాపార సంస్థల ద్వారా రైతులు కొనుగోలు చేశారు. వ్యవసాయశాఖ అంచనాలకు మించి 5 వేల మెట్రిక్ టన్నుల యూరియా అదనంగా సరఫరా చేసినప్పటికీ కొరత ఉందంటూ కొంతమంది చేస్తున్న అనవసర రాద్ధాంతంపై జిల్లా అధికార యంత్రాంగం తీవ్రంగా స్పందించింది. ఎక్కడికక్కడే రైతులతో ఎరువుల వినియోగంపై అవగాహన సదస్సులు, ఎరువుల షాపులపై ఆకస్మిక తనిఖీలు, సొసైటీల్లో ఎరువుల అమ్మకాలపై తనిఖీలు వంటివి నిర్వహిస్తూ యూరియా పక్కదారి పట్టకుండా చర్యలు చేపట్టారు. తాజా పరిణామాల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 919 మెట్రిక్ టన్నుల యూరియా సిద్ధం చేశారు. ప్రైవేట్, రిటైల్ డీలర్స్ వద్ద 612 మెట్రిక్ టన్నులు, సొసైటీలకు 148 మెట్రిక్ టన్నులు, ఆర్‌ఎస్‌కేలకు 55 మెట్రిక్ టన్నులు, మార్క్‌ఫెడ్ ద్వారా 60 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంచారు. సెప్టెంబరులో 3400 మెట్రిక్ టన్నులు సరఫరా చేయాలని వ్యవసాయాధికారులు భావిస్తున్నారు.



ముమ్మిడివరం ఎరువుల షాపులో జేసీ తనిఖీ

అధికారుల పర్యటనలు..

జిల్లాలో యూరియా కొరత తీవ్రంగా ఉందంటూ వైసీపీ ఈ నెల 9వ తేదీన అమలాపురం ఆర్డీవో కార్యాలయంలో ధర్నా నిర్వహించనున్న నేపథ్యంలో అధికారులు కౌంటర్ ఎటాక్ చేస్తున్నారు. జేసీ టి.నిషాంతి ఇటీవల ముమ్మిడివరం, పి.గన్నవరంలో ఎరువుల షాపులపై తనిఖీలు నిర్వహించారు. యూరియా విక్రయాల తీరుపై ఆదివారం అమలాపురం మండలం రోళ్లపాలెంలోని సొసైటీ కార్యాలయాన్ని సందర్శించారు. సొసైటీ అధ్యక్షుడు మట్టా మహాలక్ష్మిప్రభాకర్ యూరియా విక్రయాల తీరును జేసీకి వివరించారు. డీఆర్వో కె.మాధవి కాట్రేనికోన మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి ఎరువుల వినియోగంపై రైతులతో అవగాహన సదస్సులు నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు అంబాజీపేట మండలంలో పర్యటించగా మిగిలిన మండలాల్లో ఆయా శాఖల అధికారులు పర్యటిస్తున్నారు.యూరియా కొరత లేదని రైతుల అవసరాలకు సరఫరా చేస్తున్నట్టు ప్రకటిస్తున్నారు.

సమస్య.. పరిష్కారం దిశగా..

- చెముడలంకలో సర్వీసు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం
- మడికి కూరగాయల మార్కెట్ నుంచి చొప్పెల్ల లాకుల వరకు మూడు కిలోమీటర్ల మేర నిర్మాణం

ఆలమూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రమాదాలు అధికంగాజరిగే ఆలమూరు మండలం చెముడలంక నాలుగు లైన్ల జాతీయ రహదారిపై సర్వీసు రోడ్డు పనులు మొదలు పెట్టారు. మడికి కూరగాయల మార్కెట్ నుంచి చొప్పెల్ల లాకుల వరకు మూడు కిలోమీటర్ల మేర సర్వీసు రోడ్డు నిర్మించడానికి సర్వే పూర్తి చేశారు. తొలుత ఆక్రమణల తొలగింపునకు మూడురోజులుగా చర్యలు చేపడుతున్నారు. రోడ్డు మార్జిన్ వైట్ గీత నుంచి 12 మీటర్ల వరకు ఈ సర్వీసు రోడ్డు నిర్మాణానికి ఏర్పాటు చేస్తున్నారు.

మొత్తం 12మీటర్లలో ప్రస్తుతం రోడ్డుకు మార్జిన్‌గా మీటరు.. ఆ తర్వాత 8.5 మీటర్లు సర్వీసు రోడ్డు నిర్మిస్తారు. ఇక్కడినుంచి మీటరున్నర వెడల్పుతో డ్రైనేజీ నిర్మాణం.. ఆ తర్వాత మరో మీటరు విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు కేటాయిస్తారు. ఇలా 12 మీటర్ల వెడల్పుతో ఈ సర్వీసు రోడ్డు ఉంటుంది. వైజాగ్‌కు చెందిన సుధర్మ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీవారికి ఈ సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులు అప్పగించారు. ఆక్రమణల తొలగింపు అనంతరం తొలుత విద్యుత్ లైన్లను మారుస్తారు. ఆ తర్వాత డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడతారు. గ్రామం వైపు ఈ డ్రైనేజీ నిర్మాణం రావడంవల్ల వీధిలోనుంచి రోడ్డుపైకి రావడం చాలా కష్టతరంగా ఉంటుంది. అందుకు సంబంధించి ప్రతి రోడ్డుకు ప్రత్యేక ర్యాంపులు ఏర్పాటు చేస్తామని కాంట్రాక్ట్ ప్రతినిధులు చెప్తున్నారు.

చెముడులంక పరిధిలోనే నష్టం

మొత్తం మూడు కిలోమీటర్లు పొడవులో చెముడులంక గ్రామ పరిధిలోనే అత్యధిక షాపులు, ఇల్లులు ఉన్నాయి. 1999లో రెండు లైన్లుగా ఉన్న ఈ జాతీయ రహదారిని నాలుగులైన్లుగా విస్తరించారు. ఆ సమయంలోనే సర్వీసు రోడ్డుకు సంబంధించి భూసేకరణ జరిగింది. పూర్తిస్థాయిలో భూసేకరణ చేపట్టినట్లు నేషనల్ హైవే అధికారులు చెబుతుంటే కొందరు గృహనిర్మాణదారులు తమకు అంత వెడల్పుకు సంబంధించి డబ్బులు ఇవ్వలేదని గొడవ పెడుతున్నారు. చెముడులంకలో ఆక్రమణల తొలగింపునకు సంబంధించి ఎక్స్‌కవేటర్లతో కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు రాగా శనివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. తమకు నష్టపరిహారం ఇవ్వకుండా ఖాళీ చేసేది లేదన్నారు. చెముడులంక పరిధిలో గాంధీనగరం పిల్లకాలువ నుంచి హైస్కూల్ కాలువ వరకు ఈ సర్వీసు రోడ్డు ఉంటుంది. పాతికేళ్ల క్రితం రోడ్డు నిర్మాణం తర్వాత ఒక్కొక్కరుగా తాత్కాలిక, పర్మినెంట్‌షాపులు, భవనాలు నిర్మాణం చేపట్టారు. ఇప్పుడు ఈ సర్వీసు రోడ్డు నిర్మాణంతో వారికి నష్టం కలగనుంది. కానీ, ఆ గ్రామ రూపురేఖలు పూర్తిగా మారిపోతాయి.

సర్వీసు రోడ్డుతో ప్రమాదాల నివారణ

జాతీయరహదారి 216ఏ అధికారులు నిర్మిస్తున్న సర్వీసు రోడ్డుతో ప్రమాదాలు నివారణ జరగనుంది. మడికిమార్కెట్‌కు నిత్యం వేలాది మంది సైకిళ్లు, మోటారుసైకిళ్లపై కూరగాయల లోడుతో వెళ్లివస్తూ ఉంటారు. ఇప్పటివరకు మడికి నుంచి జాతీయ రహదారిపై మార్కెట్‌కు రాంగ్‌రూట్‌లో వెళ్లడంవల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇప్పుడు ఆ అవకాశం ఉండదు. వీరంతా సర్వీసు రోడ్డులోనే రాకపోకలు సాగిస్తారు. మడికి నుంచి హైస్కూల్ వరకు అనేకమంది విద్యార్థులు, గ్రామస్తులు రాంగ్ రూట్లోనే రాకపోకలు సాగడంవల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతూఉండేవి. ఇప్పుడు సర్వీసురోడ్డు ద్వారా వాహనాలు ప్రయాణించవచ్చు. చొప్పెల్ల, నవాబుపేట ప్రాంతాల నుంచి వచ్చేవారు ఇటే ప్రయాణించవచ్చు.

జిల్లాలో ఎరువుల కొరత లేకుండా చర్యలు

- అందుబాటులో 270 మెట్రిక్ టన్నులు యూరియా
- జిల్లా వ్యవసాయాధికారి

అంబాజీపేట, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువుల కొరత లేకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు తెలిపారు. అంబాజీపేట మండలం ఇసుకపూడి, చిరతపూడి గ్రామాల్లో రైతులకు యూరియా వాడకంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుతం 270మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ఈనెల 6న జిల్లాకు 270టన్నులు వచ్చాయని, 7న 600 మెట్రిక్ టన్నులు పంపించామని, మరో నాలుగురోజుల్లో 450 మెట్రిక్ టన్నులు జిల్లాకు వచ్చాయని అన్నారు. సమావేశంలో రైతులకు నానోయూరియా పైపాటుగా పిచికారీ చేసుకోవడం గురించి రైతులకు వివరించారు. రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే వ్యవసాయ, రెవెన్యూశాఖల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రతి సొసైటీ, ఎరువుల షాపుల్లో యూరియా స్టాక్‌లిస్టులను ప్రదర్శించాలని సూచించామన్నారు. అవసరమైన మేరకు రైతులు యూరియాను వినియోగించాలన్నారు. అంబాజీపేట మండలంలో 40 టన్నుల యూరియ అందుబాటులో ఉందన్నారు. అనంతరం నానో యూరియా వాడకంపై క్షేత్రస్థాయిలో వివరించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.శ్రీనివాస్ జీవామృతం, ఘనజీవామృతం, తూటికాడ కషాయం రైతులకు డెమో చేసి అవగాహన కల్పించారు. తహశీల్దారు చినబాబు, వ్యవసాయాధికారి కె.ధర్మప్రసాద్, సర్పంచ్‌లు తరపట్ల మోహన్‌సింగ్‌బాబురావు, కోట బేబిరాణి, సొసైటీ చైర్మన్ రంపం సత్యనారాయణ, నీటి సంఘం అధ్యక్షులు కత్తుల సాయిబాబు, సొసైటీ సభ్యులు కొత్తలంక సుబ్బారావు, మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



కిట్టు.. నచ్చేట్టు!

వసతిగృహ విద్యార్థులకు కూటమి ప్రభుత్వం బంపర్ ఆఫర్‌ప్రకటించింది. కాస్మోటిక్‌చార్జీలు పెంచడంతోపాటు నగదుకు బదులుగా విద్యార్థులకు నాణ్యమైన వస్తువులతో కూడిన కిట్లు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

- హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్ వస్తువుల అందజేత
- నగదు స్థానంలో కిట్ల పంపిణీ
- వచ్చే నెల నుంచి సరఫరా చేసేలా ప్రణాళికలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడజిల్లాలో మొత్తం సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాలు 33 కాగా వాటిలో 2,570మంది విద్యార్థులు ఉన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు జిల్లాలో 9 ఉన్నాయి. వీటిలో 1200మంది వరకు విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ కాస్మోటిక్‌కిట్లు అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు.

కిట్లలో ఏముంటాయంటే..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కాస్మోటిక్స్ చార్జీలకింద నగదు ఇస్తామని నెలలపాటు నిధులు విడుదల చేయకుండా వసతిగృహ విద్యార్థులను అప్పటి ప్రభుత్వం ఇబ్బందిపెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగదు స్థానంలో విద్యార్థులకు వస్తువులు అందజేయాలని నిర్ణయించింది. దీనిలో భాగంగానే సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల విద్యార్థులకు కొబ్బరినూనె, టూత్ పేస్టు, షాంపు, స్నానపు సబ్బు, దుస్తులు ఉతుక్కునే సబ్బులు ఉంటాయి. విద్యార్థినులకు అదనంగా బొట్టు బిళ్లలు, పౌడర్, శానిటరీ ప్యాడ్స్. ఇలా రెండు నెలలకు సంబంధించిన సామగ్రిని ఒకేసారి ఇస్తారు. 3-6 తరగతుల విద్యార్థులకు గతంలో నెలకు రూ.100 చెల్లిస్తుండగా దాన్ని రూ.125కు పెంచారు. విద్యార్థినులకు రూ.110 నుంచి రూ.130కు పెంచారు. ఏడో తరగతినుంచి టెన్త్‌విద్యార్థులకు రూ.125నుంచి రూ.150, విద్యార్థినులకు రూ.160నుంచి రూ.200కి పెంచారు. కేజీబీవీల్లోని ఇంటర్ విద్యార్థులకు రూ.125 నుంచి రూ.200 వరకు, విద్యార్థినులకు రూ.160 నుంచి రూ.250 వరకు కాస్మోటిక్స్ చార్జీలు పెంచారు. ఇలా పెంచే మొత్తాలకు కాస్మోటిక్స్ కిట్లు అందజేయనున్నారు. బాలురు హెయిర్ కటింగ్‌కు రూ.30 ఇచ్చేవారు.. ప్రస్తుతం రూ.50కి పెంచారు.

వదలని భానుడు

- కానరాని వరుణుడు
- మండుతున్న ఎండలు
- 10 వరకూ నిప్పులకొలిమే
- మళ్లీ 12 నుంచి 18 వరకు
- వాతావరణ శాఖ హెచ్చరిక



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఎండలు మండిపోతున్నాయి. వేసవిని తలపిస్తున్నాయి. వర్షాకాలంలో వానలు పడి.. చల్లగా ఉండాల్సిన వాతావరణం వేడెక్కిపోతోంది.ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఒక పక్క అల్పపీడన ప్రభావంతో వర్షాలు పడతాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేస్తున్నా.. చినుకు జాడ కానరావడం లేదు. మరో వైపు సూర్యుడు మాత్రం తన ప్రతాపం చూపుతున్నాడు. ఇలాంటి సమయంలో బయటకు రావాలంటేనే జనం బెంబేలెత్తిపోతున్నా రు. ఏసీ ఉంటే తప్ప గదిలో ఉండలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఉదయం 10 గంటల్లోపే జనం బయట పనులన్నీ పూర్తి చేసుకుని ఇంటి దారిపడుతున్నారు. అత్యవర పనులకు బయటకు వచ్చేవారు పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రస్తుత వాతావరణం వేసవిని తలపించేలా ఉందని..అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్నామని జిల్లా వాసులు అంటున్నారు. శుక్ర, శనివారాల్లో వాతావరణం మేఘావృతమై ఉంటుందని ఊహించినా..అందుకు విరుద్ధంగానే పరిస్థితులున్నాయి. ఆదివారం ఉష్ణోగ్రతలు మరింత పెరిగాయి.

పదో తేదీ వరకు నిప్పుల కొలిమే..

ఈ నెల ఐదో తేదీ వరకు వర్షాలు పడతాయని చెప్పిన వాతావరణశాఖ.. మరో పిడుగులాంటి వార్తను వినిపించింది. ఈనెల పదో తేదీ వరకు వాతావరణం నిప్పుల కొలిమిని తలపిస్తుందని అంటున్నారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఈనెల 12 నుంచి 18వతేదీ మధ్యలో ఎండలు మరింత ముదురుతాయని చెబుతున్నారు. వాస్తవానికి ఉష్ణోగ్రత సాధారణంగా 30డిగ్రీల లోపు మాత్రమే ఉంటోంది. కానీ రెండు రోజులుగా 30 నుంచి 35 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అసలే వాతావరణ మార్పులతో ప్రజలు పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. జ్వరా ల బారిన పడుతున్నారు. వర్షాలు పడాల్సిన సమయంలో తిరిగి ఎండలు విజృంభించడంతో ప్రజలు అల్లాడుతున్నారు. సమ్మర్ సీజన్ 2.0ను తలపించేలా ఉన్న ఈ పరిస్థితుల్లో ప్రజలు ఎండలబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వాతావరణశాఖ నిపుణులు చెబుతున్నారు.

అప్రమత్తత అవసరమే..

- పశువులు, జీవాల పట్ల అశ్రద్ధ వద్దు
- ప్రస్తుతం వ్యాధులు వ్యాప్తి చెందే కాలం
- లక్షణాలు కనబడితే పశువైద్యులను సంప్రదించాలి

7

'జయలక్ష్మి' బాధితులకు సత్వర న్యాయం చేయాలి

7

రేషన్ షాపులకు ఈ పోస్ మిషన్లు

- అప్‌డేట్ చేసి మార్పు
- త్వరలోనే అందజేత

సామర్లకోట,సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రేషన్ అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగా ఇటీవల రేషన్ కార్డులను స్మార్ట్‌గా చేసిన ప్రభుత్వం మరో అడుగు ముందుకే సింది. రేషన్ డిపోల్లో ఇప్పటివరకూ ఉన్న ఈ-పోస్ మిషన్లను ప్రభుత్వం మార్చుతోంది. కొత్త వాటిని అందించనుంది. అప్ డేట్ వెర్షన్‌లతో కూడిన నూతన ఈ-పోస్ మిషన్లతో అక్టోబరు నెల రేషన్ సరుకులను పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే కొత్త మిషన్ల వినియోగంపై డీలర్లకు అవగాహన కల్పిస్తున్నారు. రేషన్ డిపోల్లో అక్రమాలను అరికట్టాలనే ఉద్దేశంతో 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ-పోస్ మిషన్లను తీసుకొచ్చింది. జీఎల్ 11 మోడల్‌కు చెందిన మిషన్లను అప్పట్లో అందించింది. పదేళ్ల తర్వాత వీటిని మార్చుతూ తిరిగి తెలుగు దేశం ప్రభుత్వం లోనే నూతన ఈ-పోస్ మిషన్లను మార్పులు చేస్తుండడం విశేషం. వీటికి 5జీ సపోర్టు ఉంటుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2,857 రేషన్ డిపోలున్నాయి. ఇవి జిల్లాలవారీగా చూస్తే కాకినాడ జిల్లాలో 1,060, అంబేడ్కర్ కోన సీమ జిల్లాలో 926, తూర్పుగోదావరి జిల్లాలో 871 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటన్నింటికీ కొత్త ఈ-పోస్ మిషన్లను అందించేందుకు పౌరసరఫరాలశాఖ అన్ని సన్నాహాలు పూర్తి చేసింది.

అప్రమత్తత అవసరమే..

- పశువులు, జీవాల పట్ల అశ్రద్ధ వద్దు
- ప్రస్తుతం వ్యాధులు వ్యాప్తి చెందే కాలం
- లక్షణాలు కనబడితే పశువైద్యులను సంప్రదించాలి



పశువుకు ముద్ద చర్మ వ్యాధి సోకిన దృశ్యం (ఫైల్)

కాకినాడ క్రైం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పశువులు(గేదెలు, ఆవులు), జీవాలు(మేకలు, గొర్రెలు)ను పెంచే పెంపకందార్లు వాటిని చంటి పిల్లలు మాదిరిగా చూసుకుంటారు. ప్రస్తుతం వర్షాకాలంలో పశువులకు అనేక రకాల వ్యాధులు సోకుతాయి. అప్పటివరకు ఎండతో మరిగి ఉన్న నేల వర్షపు నీరు, వరదలతో తడిసి వరదలు తగ్గుముఖం పట్టాక మురుగు నీరు ఇంకి, వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది. నేల చిత్తడిగా మారినప్పుడు అనేక రోగాలు సంక్రమిస్తాయి. ఒక్కోసారి మూగజీవాలకు సంక్రమించేవి సాధారణ వ్యాధులు అయినా అప్రమత్తతతో కూడిన సంరక్షణ చర్యలు తీసుకోకపోతే వ్యాధి తీవ్రతరమై పశువు మరణించి పాడిరైతు నష్టపోయే అవకాశం ఉంటుంది. అందువల్ల పశువుల ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వెటర్నరీ వైద్యులు సూచిస్తున్నారు.

వచ్చే వ్యాధులు...

వర్షాకాలంలో పశువులకు గొంతు వాపు వ్యాధి, ముద్ద చర్మ వ్యాధి, జబ్బ వాపు వ్యాధి, గాలి కుంటు వ్యాధి, జలగ వ్యాధి జీవాలకు నీలి నాలుక వ్యాధి, కాలి పుండు వ్యాధులు సంక్రమించడానికి ఎక్కువగా అవకాశాలున్నాయి. గొంతు వాపు వ్యాధిలో గొంతు కింది భాగంలో జలవాపు ప్రారంభమై క్రమంగా మెడ కింది భాగానికి అనంతరం రొమ్ము భాగానికి చేరి ఆయాసంతో కూడిన గురక వచ్చి నోరు, ముక్కు నుంచి నురగ కారుస్తుంది. ఈ లక్షణం కనబడిన వెంటనే వైద్యచికిత్స అందకపోతే పశువు మరణిస్తుంది. ముద్ద చర్మ వ్యాధిలో తీవ్ర జ్వరంతోపాటు చర్మం కింద కణుతులు వచ్చి కళ్లు, ముక్కు నుంచి నీరు కారుతుంది. దూడల్లో వ్యాధి తీవ్రత ఎక్కువైతే చనిపోయే అవకాశాలు ఎక్కువ. జబ్బవాపు వ్యాధి సోకిన పశువులకు జ్వర తీవ్రత ఎక్కువగా ఉండి శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటుంది. కండరాలవాపు, ఆ ప్రదేశంలో చర్మం కమిలి వెచ్చగా, నొప్పిగా ఉంటుంది. చేత్తో ఒత్తిడి కలిగించినప్పుడు గాలి బుడగల శబ్దం వినిపిస్తుంది. గాలికుంటు వ్యాధిలో జ్వరంతోపాటు నోటిలో, గిటల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం సరిగా తీసుకోలేకపోవడం వల్ల నీరసపడిపోవడంతో పాల దిగిబడి, పునరుత్పత్తి సామర్థ్యం తగ్గిపోతుంది. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న దూడలు మరణించే అవకాశాలు ఎక్కువ. జీవాల్లో అయితే నీలి నాలుక వ్యాధితో నోటిలో అధికంగా పుండ్లు ఏర్పడతాయి. ఈ వ్యాధి వల్ల గిట్టల మధ్య వాపు వచ్చి చర్మం ఎర్రగా మారి క్రమంగా పగుళ్లు ఏర్పడతాయి. జ్వరం, నొప్పి వల్ల సరిగా నడవలేక ఆహారం తీసుకోవడం కష్టతరమవుతుంది.



మేకకు వ్యాక్సిన్ వేస్తున్న వెటర్నరీ డాక్టర్ (ఫైల్)

ఉచితంగా టీకాలు...

ఈ వ్యాధులకు నివారణా చర్యగా జిల్లా పశుసంవర్థకశాఖ ఏడాదికి రెండుసార్లు రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా టీకాలు సరఫరా చేస్తుంది. జిల్లాలోని పశువైద్యశాలలు, రైతు సేవా కేంద్రాల్లో ఈ టీకాలు అందుబాటులో ఉంటాయి. గొంతువాపు, జబ్బవాపు వ్యాధులకు ఏప్రిల్, నవంబర్ నెలల్లో, గాలి కుంటువ్యాధికి సెప్టెంబర్, ఫిబ్రవరి నెలలో ముద్ద చర్మ వ్యాధి, నీలి నాలుక వ్యాధులకు జూన్, జూలై నెలల్లో పశువైద్యసిబ్బంది టీకాలు వేస్తారు. ఈ టీకాలు వ్యాధి పొడుగునా పశువైద్యకేంద్రాల్లో అందుబాటులో ఉంటాయి. రైతులు ఈ సేవలను వినియోగించుకుని నష్టాలను నివారించుకోవచ్చు.

ముందస్తు జాగ్రత్త చర్యలు తప్పనిసరి

సీజనల్ వ్యాధులను నివారించేందుకు ముందస్తు జాగ్రత్త చర్యలు తప్పనిసరిగా పాటించాలి. పశువుల పాకల చుట్టూ దోమ తెరలు ఏర్పాటు చేసుకోవాలి. ఆయా పరిసర ప్రాంతాల్లో పొడిగా నీళ్లు నిల్వకుండా చూసుకోవాలి. పశువుల షెడ్లలో దోమల బెడద ఎక్కువగా ఉన్నప్పుడు వాటిని నియంత్రించేందుకు సాయంత్రం సమయాల్లో పచ్చి వేపాకు పొగ పెట్టడం ద్వారా చాలావరకు ఆ సమస్యను నియంత్రించవచ్చు. పశువులు వర్షంలో తడవకుండా షెడ్లలో ఉంచడం, ఎత్తైన ప్రదేశాల్లో ఉంచడం, కలుషిత నీరు తాగకుండా జాగ్రత్తలు తీసుకోవడం, పశువులశాలలు పరిశుభ్రంగా ఉంచడం వ్యాధి బారినపడిన పశువులను ఆరోగ్యంగా ఉన్న పశువుల నుంచి వేరు చేయడం, అనారోగ్యంతో ఉన్న పశువులకు సకాలంలో వైద్యచికిత్స అందించేలా చర్యలు తీసుకోవడం వంటి ముందస్తు జాగ్రత్త తీసుకుంటే పశువులు, జీవాలు వ్యాధుల బారిన పడకుండా ఉండడమే కాకుండా రైతులు కూడా నష్టపోకుండా ఉంటారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న పశువైద్యశాలల్లో టీకాలతోపాటు పశువులు, జీవాలకు కావాల్సిన మందులు సమృద్ధిగా ఉన్నాయి.

డాక్టర్ వై.కృష్ణజ్యోతి, డీడీ, పశుసంవర్ధకశాఖ, కాకినాడ జిల్లా

తెలియని రోగం... తెగ ఇబ్బంది!

- లబ్బర్తి, లాగరాయి, కింద్ర గ్రామాల ప్రజల అవస్థలు
- జ్వరం, కీళ్ల, నడుం నొప్పులతో సతమతం



లబ్బర్తి గ్రామంలో మంచం పట్టిన యువతి

రాజవొమ్మంగి సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలో తెలియని రోగంతో మూడు గ్రామాల ప్రజలు మంచం పట్టారు. మండలంలోని లబ్బర్తి, లాగరాయి, కింద్ర గ్రామాల ప్రజలు గత 2 నెలలుగా అనారోగ్యంతో ఆసుపత్రులకు రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. 3 గ్రామాల్లో ప్రజలకు ఒకే రీతిగా.. జ్వరం రావడం ఆసుపత్రికి వెళ్లి మందులు వాడిన తరువాత జ్వరం తగ్గుముఖం పట్టి, కీళ్ల నొప్పులు, నడుం పట్టేసి మంచంపై నుంచి సైతం లెగలేకుండా ఉంటున్నారు. నిత్యం పెయిన్ కిల్లర్ ట్యాబ్లెట్లు వేసుకుంటే తప్ప కాలకృత్యాలు కూడ తీర్చుకోలేని పరిస్థితి. ఈ గ్రామాల ప్రజలు లాగరాయి ప్రభుత్వ ఆసుపత్రిలో మందులు వాడిన పనిచేయలేదని, మైదాన ప్రాంతాలలో ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకుంటున్నామని వాపోయారు. దీనిపై రాజవొమ్మంగి ఎంపీపీ గోము వెంకటలక్ష్మి మాట్లడుతూ గతంలో దీనిపై జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేయడంతో డీఎంహెచ్‌వోని పంపాగా రోగులను పరిశీలించి బ్లడ్ శాంపిల్స్‌ను ల్యాబ్‌కి పంపినా అధికారులు నేటికి ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ప్రజలు మృత్యువాత పడితే కాని స్పందించరా అని ఎంపీపీ ప్రశ్నించారు. అయితే పారిశుధ్య లోపమా, నీటి కాలుష్యమా, వైద్యులు పట్టించుకోని వైనమా తెలియదు కాని ఉన్నతాధికారులు తక్షణం స్పందించి గ్రామాల్లో తాము పడుతున్న అనారోగ్య సమస్యలపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కింద్ర గ్రామంలో రామాలయ ఆరుబయట జారబడ్డ జనం

గ్రహణం వేళ తెరిచి ఉన్న పాదగయ



తెరిచి ఉన్న కుక్కుటేశ్వరస్వామి ఆలయం

కుక్కుటేశునికి అభిషేకాలు

పిఠాపురం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం సమయంలో కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రం తెరిచే ఉంది. గ్రహణ సమయంలో రాష్ట్రంలోని అన్ని ఆలయాలను మూసివేసినా పాదగయతో పాటు శ్రీకాళహస్తి ఆలయాలు మాత్రమే తెరిచి ఉంటాయి. ప్రాచీన కాలం నుంచి వస్తున్న సంప్రదాయాలకు అనుగుణంగా గ్రహణ సమయంలో కుక్కుటేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. బ్రాహ్మణులు, అర్చకులు, పురోహితులు పాదగయ పుష్కరిణిలో పట్టువిడుపు స్నానాలు ఆచరించారు. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి ఆలయంతో పాటు అన్ని ఆలయాలు తెరిచే ఉన్నాయి. పూజల్లో ఆలయ ఈవో కట్నం జగన్మోహన శ్రీనివాస్ తదితరులున్నారు.

ఇంటి నుంచి బయటకు వెళ్లి.. చెరువులో శవంగా తేలి!

దుర్గాడలో యువకుడి మృతి



వెంకటేష్ (ఫైల్)

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు చెరువులో శవమై తేలి కనిపించాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన బొమ్మిడి వెంకటేష్(25) ఈనెల 6వ తేదీ మధ్యాహ్నం భోజనం చేసి ఇంటి నుంచి బయటకువెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతికినా ఫలితం లేకపోయింది. ఆదివారం గ్రామంలోని కొత్త చెరువులో వెంకటేష్ మృతదేహం ఉండడాన్ని గ్రామస్తులు గుర్తించారు. అతడు బహిర్భూమికి వెళ్లి జారిపడి మరణించి ఉండవచ్చని భావిస్తున్నారు. అతడికి భార్య, కూతూరు ఉన్నారు. వ్యవసాయ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించే వెంకటేష్ మరణించడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో జూనియర్ లైన్‌మెన్ మృతి



నాగార్జున (ఫైల్)

ఎటపాక, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో జూనియర్ లైన్‌మెన్ మృతిచెందిన ఘటన అల్లూరి జిల్లా ఎటపాక మండలం వెంకటరెడ్డిపేట గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గుండాల గ్రామ సచివాలయంలో జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న ముర్రం నాగార్జున (35) మరో లైన్‌మెన్ శంకర్‌తో కలిసి ఆదివారం మధ్యాహ్నం వెంకటరెడ్డిపేట గ్రామం వెళ్లారు. ఎల్‌టీ విద్యుల్ లైన్‌పై చెట్టు కొమ్మలు విరిగిపడి గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని సమాచారం ఇవ్వడంతో ఇద్దరు పరిశీలించారు. విద్యుత్ సరఫరా నిలిపి వేసి లైన్‌పై చెట్ల కొమ్మలు తొలగించే క్రమంలో విద్యుత్ సరఫరా జరగడంతో నాగార్జున, శంకర్ విద్యుత్ షాక్‌కు గురయ్యారు. దీంతో నాగార్జున అపస్మారక స్థితికి వెళ్లడంతో వెంటనే భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కాగా నాగార్జున స్వగ్రామం ఎటపాక మండలం బొజ్జిగుప్ప గ్రామం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కళారంగాన్ని ఆదరిస్తున్న కాకినాడ ప్రజలు

సినీ నటుడు తనికెళ్ల భరణి



జీవన సాఫల్యం పురస్కారం అందుకుంటున్న తనికెళ్ల భరణి

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు కాకముందు సుమారు 45 ఏళ్ల క్రితం కాకినాడలో నాటకం రాశానని, అప్పుడు ప్రజలు నాటక, కళారంగాన్ని ఎలా ఆదరించారో నేటికి అలాగే ఆదరాభిమానాలు చూపించడం తనను మంత్రముగ్ధున్ని చేసిందని నటుడు, రచయిత, దర్శకుడు తనికెళ్ల భరణి అన్నారు. దంటు కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, దియంగ్మెన్స్ హ్యాపీక్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమెరికామెడీ కథలు నాటికల ప్రదర్శనలో భాగంగా తనికెళ్ల భరణికి జీవన సాఫల్యం పురస్కారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులు చప్పట్లు మాత్రమే కోరుకుంటారని, ఇక్కడ హాలు నిండుగా ఉన్న జనాన్ని చూస్తుంటే ఎనలేని ఆనందంగా ఉందన్నారు. సుమారు వందేళ్లకు పైబడి నాటక రంగానికి దియంగ్మెన్స్ హ్యాపీ క్లబ్, దంటు కుటుంబీకులు చేస్తున్న సేవలు నిరుపమానమన్నారు. అమెరికాలో ఉంటూనే తెలుగు సాహిత్యం, భాష, కళలల పట్ల మక్కువతో వంగూరి చిట్టెన్ రాజు ఎంతో పాటుపడుతున్నారన్నారు. చిట్టెన్ రాజు మాట్లాడుతూ తనికెళ్ల భరణి నటుడిగా, సాహితీవేత్తగా తనకంటూ ప్రత్యేక ముద్రను వేసుకున్నారని ఆయనకు పురస్కారం అందజేయడం ఆనందంగా ఉందన్నారు. బామ్మాయణం, సన్యాసీ నవ్వాడు, భార్య బాధితుల సంఘం నాటికలు ఆద్యంతం నవ్విస్తూ ఆలోచింపజేశాయి. యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు దంటు సూర్యారావు, కార్యదర్శి నాదెళ్ల ప్రభుదాసు, మార్ని జానకిరామ్ చౌదరి, కృష్ణారావు, సుచిత్రమూర్తి పాల్గొన్నారు.

చంద్రగ్రహణం ఎఫెక్ట్: ఆలయాలు మూసివేత

అన్నవరంలో...


అన్నవరం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా కాకినాడ జిల్లా అన్నవరంలో సత్యదేవుడి ఆలయం తలుపులు ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు మూసివేశారు. ఉదయం 10గంటలకు వ్రతం టిక్కెట్ల విక్రయాలు నిలుపుదల చేశారు. ప్రధానాలయంతో పాటుగా తూర్పురాజగోపురం, పశ్చిమ రాజగోపుర తలుపులకు కవాటబంధనం గావించారు. గ్రహణం అనంతరం సోమవారం ఉదయం ఆలయాన్ని సంప్రోక్షణ గావించి ఉదయం 7 గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభమవుతాయని ఈవో సుబ్బారావు తెలిపారు. కవాటబంధనం కార్యక్రమంలో ఈవోతో పాటుగా ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఏఈవో భాస్కర్ ఉన్నారు.

అంతర్వేదిలో...

అంతర్వేది, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ఆలయాన్ని మూసివేసినట్టు ఆలయ సహాయ కమిషనర్ ఎం.ప్రసాద్ తెలిపారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం దర్శనాలు ప్రారంభమవుతాయన్నారు. నిత్యం జరిగే ఆర్జిత అభిషేకాలు రద్దు చేసి ఉదయం 10గంటలకు సుదర్శన హోమం నిర్వహిస్తామన్నారు.



అంతర్వేదిలో ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకులు, అధికారులు



సామర్లకోట భీమేశ్వరాలయ తలుపులు మూసివేసిన దృశ్యం



ద్రాక్షారామలో భీమేశ్వరాలయ ప్రధాన ద్వారం మూసివేస్తున్న అర్చకస్వామి

సామర్లకోటలో...

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోటలో పంచారామ పుణ్యక్షేత్రమైన కుమారారామ భీమేశ్వరాలయం తలుపులను ఆదివారం మధ్యాహ్నం దేవాదాయ అధికారుల సమక్షంలో ఆలయ పండితులు మూ సివేశారు. గ్రహణం విడుపు అనంతరం సోమ వారం ఉదయం ఆలయ ఆవరణ అంతా సంప్రో క్షణ చర్యల తర్వాత స్వామి,అమ్మవార్లకు నిత్యపూజలు ప్రారంభించి దర్శనాలకు భక్తులకు అనుమతిస్తామని ఈవో నీలకంఠం తెలిపారు.

ద్రాక్షారామలో...

ద్రాక్షారామ (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆదివారం కోనసీమ జిల్లాలోని ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని మూసివేశారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు స్వామికి మహానివేదన సమర్పించారు. అనంతరం ఆలయం తలుపులు మూసివేశారు. సోమవారం ఉదయం మహాసంప్రోక్షణ అనంతరం 7.30 గంటలకు ఆలయం తెరుస్తామని, భక్తులను దర్శనాలకు అనుమతిస్తామని ఆలయ సహాయ కమీషనరు అల్లు వెంకట దుర్గాభవానీ తెలిపారు.

వాడపల్లిలో...

ఆత్రేయపురం (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు ఆలయ అర్చకులు మూసివేశారు. సోమవారం ఉదయం 7 గంటలకు ఆలయాన్ని తెరిచి సంప్రోక్షణ పూజల అనంతరం భక్తులకు దర్శనాలు అనుమతి ఇస్తామని ఆలయ ఉపకమిషనరు సూర్యచక్రధరరావు తెలిపారు.



వాడపల్లిలో తాళాలు వేస్తున్న అర్చకులు

'జయలక్ష్మి' బాధితులకు సత్వర న్యాయం చేయాలి

తక్షణం మహాజన సభ ఏర్పాటు చేయాలి

బాధితుల సంఘం డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న జయలక్ష్మి సొసైటీ బాధితుల సంఘం ప్రతినిధులు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయల ఆర్థిక మోసానికి పాల్పడిన నిందితులపై చర్యలు, సీబీసీఐడీ సీజ్ చేసిన ఆస్తులు కోర్టు ద్వారా సొసైటీకి వచ్చేలా చర్యలు తీసుకోవడంలో జయలక్ష్మి సొసైటీ పాలకవర్గం వైఫల్యం చెందింది. ఆర్థిక లావాదేవీల కార్యకలాపాల్లో పారదర్శకత లోపించడంతో సుమారు రూ.3.7కోట్ల అవకతవకలు జరిగాయి. బాధితులకు సత్వర న్యాయం చేయాలని, తక్షణం మహాజన సభ ఏర్పాటు చేయాలని ది జయలక్ష్మి ఎంఏఎం సొసైటీ లిమిటెడ్ డిపాజిటర్స్ బాధితుల సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం కాకినాడ విద్యుత్తునగర్‌లోని చల్లా కల్యాణ మండపంలో బాధితుల సంఘం కార్యదర్శి పిల్లి గణేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సభ్యులు ఆకెళ్ల సుబ్రహ్మణ్యం, కస్తూరి రవికుమార్, టీవీడీఎన్‌వీపీ రావు, జీవీవీ రెడ్డి, రాజగోపాల్ మాట్లాడారు. ప్రస్తుత బోర్డు పనితీరు సక్రమంగా లేదని, రుణాల వసూళ్లు, బ్యాంకు డిపాజిట్లలో అవకతవకలు జరిగాయని విమర్శించారు. రుణం తీసుకున్న వ్యక్తుల నుంచి పూర్తిస్థాయిలో డబ్బులు రికవరీ చేయకుండా డాక్యుమెంట్లు వెనక్కి ఇచ్చేశారని, దీని వల్ల సొసైటీకి సుమారు రూ.3.7కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు ఇటీవల అధికారుల విచారణలో తేటతెల్లమైందన్నారు. ఏపీఎంఏసీఎస్ యాక్ట్ 21 మేరకు చైర్మన్, మరో నలుగురు డైరెక్టర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు బాధ్యులుగా రిపోర్టులో పేర్కొన్నారు. 'నిందితులు, లోన్ తీసుకున్న వారి ఆస్తులు సీజ్ చేయించాం... కోర్టుల్లో ఉన్నాయి... నిందితులపై కేసులు, చార్జిషీట్లు వేయిస్తున్నా'మని కబుర్లు చెప్పడం తప్పించి ఎటువంటి ఫలితం కనిపించట్లేదన్నారు. సొసైటీ ఏర్పాటై సుమారు మూడేళ్లు కావచ్చినా బాధితులకు నేటికీ ఏ న్యాయం జరగలేదన్నారు. బాధితుల్లో సుమారు 80మందికి పైగా చనిపోయారన్నారు. ప్రస్తుత బోర్డు సభ్యులు అనుసరిస్తున్న చర్యలపై సభ్యులు అసంతృప్తితో ఉన్నారని, తక్షణం మహాజన సభ ఏర్పాటు చేసి బోర్డులో మార్పులు, చేర్పులు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో సొసైటీ నిర్వహణ కోసం బాధితులంతా కలసి చైర్మన్‌కు రూ.లక్ష చెక్కు ఇచ్చామని, తక్షణం వడ్డీతో సహా వెనక్కి ఇవ్వాలని, బాధిత సంఘంలో సభ్యుల మార్పులు, చేర్పులు చేపట్టాలన్నారు. అవసరమైతే ఈ మేరకు క్రిమినల్ కేసులు వేయడం, ప్రభుత్వ జోక్యంతో పాత కమిటీని రద్దుచేసి నూతన పాలకవర్గాన్ని ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సభ్యులు తీర్మానించారు. సమావేశంలో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంలకు చెందిన సుమారు 150 మంది సభ్యులు పాల్గొన్నారు.

'అద్దేపల్లి అభిప్రాయం ధృడం'



రెంటాల దంపతులకు అద్దేపల్లి పురస్కారం అందజేస్తున్న అతిథులు

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అద్దేపల్లి రామమోహనరావు ముక్కుసూటిగా, ధృడమైన అభిప్రాయాలు కలిగి ఉండే వారని, ఆయన రచనల్లోనూ అది ప్రస్ఫుటిస్తుందని వక్తలు పేర్కొన్నారు. ప్రజాకవి అద్దేపల్లి రామమోహనరావు సాహిత్య పురస్కారం 2025 ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి కల్పనా సెంటర్లోని రోటరీ హాల్లో నిర్వహించారు. అద్దేపల్లి రామ్మోహనరావు సాహిత్య పురస్కార వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి అద్దేపల్లి ఉదయ భాస్కరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజమహేంద్రవరానికి చెందిన ఎస్ఆర్.పృథ్వీ మాట్లాడుతూ వయోబేధం లేకుండా ప్రతీ ఒక్కరినీ సాహిత్యంలో ప్రోత్సహించిన గొప్ప సాహితీవేత్త అద్దేపల్లిగా పేర్కొన్నారు. మధునాపంతుల సత్యనారాయణ మాట్లాడుతూ అద్దేపల్లి ఆధునిక కవిత్వం వైపు వచ్చి అనేక రచనలు చేశారన్నారు. ప్రపంచీకరణను వ్యతిరేకిస్తూ తన సాహిత్యంలో దాన్ని ప్రతిధ్వనింపజేశారన్నారు. పురస్కార గ్రహీత రెంటాల శ్రీవేంకటేశ్వరరావు మాట్లాడుతూ గజల్స్ పాడిన వారిలో అర్థవంతంగా పాడి కొత్త వరవడికి అద్దేపల్లి శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం అతిథులు రెంటాల దంపతులకు అద్దేపల్లి రామ్మోహనరావు సాహిత్య పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. వచన కవిత పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో అద్దేపల్లి రాధాకృష్ణ, అద్దే పల్లి ప్రభు, వాడ్రేవు వీరలక్ష్మీదేవి, గౌరినాయుడు, గనారా, సాహితీ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

దళితుడిపై దాడి

అట్రాసిటీ కేసు నమోదు



గాయాలు చూపుతున్న వెంకటేష్

ఎటపాక, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దళితుడిని దూషిస్తూ కర్రతో దాడిన వ్యక్తిపై పోలీస్ స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ అప్పల రాజు తెలిపారు. వివరాల ప్రకారం.. అల్లూరి జిల్లా ఎటపాక మండలం గౌరి దేవిపేట గ్రామానికి చెందిన పశువుల కాపరి గవ్వల వెంకటేష్ రోజు మాదిరిగానే గెదేలను మేపడానికి వెళ్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన జంగాల సాయిబాబు తన గెదే, లేగదూడను తొలుకెళ్లే వియషంలో ఇద్దరి మధ్య వివాదం జరిగింది. ఈ క్రమంలో వెంకటేష్ గెదేలతో సాయంత్రం ఇంటికి తిరికొస్తుండగా అతడిని సాయిబాబు కులం పేరుతో దూషించడంతోపాటు దుర్భాషలాడుతూ కర్రతో దాడి చేశాడు. దీంతో తల, చేతిపై గాయాలయ్యాయి. బాధితుడు ఫిర్యాదు మేరకు సాయిబాబుపై అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఎస్ఐ అప్పలరాజు తెలిపారు.

డొంకరాయి నుంచి దిగువకు నీటి విడుదల

మోతుగూడెం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి దిగువకు నీటి విడుదల ఆదివారం కూడా కొనసాగిందని జెన్‌కో అధికార్లు తెలిపారు. జలాశయంలో నీటి మట్టం 1034.60 అడుగుల వద్ద స్థిరంగా కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో జలాశయం నీటి మట్టం 1034.60 అడుగులకు పెరగకుండా జలాశయం నుంచి దిగువకు 1000క్యూసెక్కుల నీటిని, అలాగే పొలూరు జల విద్యుత్ కేంద్రానికి పవర్ కెనాల్ ద్వారా మరో 4వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్న జెన్‌కో అధికారులు తెలిపారు.

అన్నసమారాధనలు

అంతర్వేది, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో గణేష్ నవరాత్రుల్లో భాగంగా నిమజ్జన మహోత్సవాల అనంతరం అంతర్వేది దేవస్థానం ఏటిగట్టు వద్ద, అంతర్వేది రావివారి గ్రూపు తదితర గ్రామాల్లో అఖండ అన్నసమారాధనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

కళ్లజోళ్ల పంపిణీ

మలికిపురం, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): తూర్పుపాలెంలో పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకున్న 60మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీచేశారు. సర్పంచ్ గుర్జింక మురళీవెంకటసత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు సూర్యనారాయణమూర్తి, అడబాల సాయిబాబు, వెంకటరమణ పాల్గొన్నారు.

మంచి అలవాట్లకు మించిన మందుల్లేవు

- డాక్టర్ మంతెన సత్యనారాయణరాజు



మాట్లాడుతున్న డాక్టర్ మంతెన సత్యనారాయణరాజు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మంచి అలవాట్లకు మించిన మందులు లేవని డాక్టర్ మంతెన సత్యనారాయణరాజు పేర్కొన్నారు. ఎంత వ్యాయామం చేసినా సరైన ఆహార నియమాలు పాటించకపోతే శరీరానికి లబ్ధి చేకూరదన్నారు. ఎన్ని పనులు చేస్తున్నా లోపల భయం, అనుమానాలు ఉంటే ఆశించిన ఫలితాలు దక్కవన్నారు. ఆదివారం అమలాపురం బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలోని హార్మోనీ హౌస్‌లో ఓం శాంతి కేంద్రం ఇన్‌చార్జి బీకే శ్రీదేవి అధ్యక్షతన హెల్త్ అండ్ వెల్త్ అవగాహన సదస్సుకు సత్యనారాయణరాజు ముఖ్య వక్తగా మాట్లాడారు. ఆరోగ్యానికి అడ్డదారులు ఉండవని, ఉదయమే అల్పాహారం తీసుకుని భోజన నియమాలు పాటిస్తే సరిపోతుందన్నారు. శరీరం ఆరోగ్యవంతంగా ఉండేందుకు అవసరమైన మెకానిజం అంతా లోపలే ఉంటుందన్నారు. ఆలోచనను బట్టే ఆకలి వేస్తుందని తద్వారా హార్మోన్ల బ్యాలెన్స్ జరుగుతుందన్నారు. పందెం కోడికి పప్పులు ఆహారంగా పెడితే ఎలా బలంగా తయారవుతుందో అదేవిధంగా ప్రతీ మనిషి రోజుకు ఒక్కపూటైనా మొలకెత్తిన విత్తనాలు, పండ్లు వంటి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. మనిషి సంతోషంగా ఉన్నప్పుడే హార్మోన్లు ఉత్పత్తి అవుతాయని, మంచిఆరోగ్యం ద్వారా ఆరోగ్యకర హార్మోన్లు ఉత్పత్తి అయి జబ్బుల బారిన పడకుండా ఉంటారన్నారు. శారీరకఆరోగ్యం ఎంత అవసరమో మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమన్నారు. సాత్వికఆహారం తీసుకుంటే ఆరోగ్యం మీవెంటే ఉంటుందన్నారు. ప్రతీ ఒక్కరు ధ్యాన మార్గాన్ని ఎంచుకుని తమ పరిధిలోని ఒత్తిళ్లను తగ్గించుకోవాలని సూచించారు. జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది ఆరోగ్య సదస్సులో పాల్గొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జి బీకే రజనీ, బీకే స్వరూప, పురప్రముఖులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల దుష్ప్రచారం: ఎమ్మెల్యే



మాటాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులతో కలిసి నాపై దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మండిపడ్డారు. రెండు రోజులుగా అహంకారంతో కూడిన ఎమ్మెల్యే అంటూ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జగ్గన్నపేట సెంటర్‌లో బస్సును తప్పించే క్రమంలో ఆటో దురుసుగా వచ్చిందన్నారు. ఆటో డ్రైవర్‌ను అతని సోదరుడు క్యాంపు కార్యాలయానికి తీసుకుని వస్తే జాగ్రత్తగా నడపాలని సూచించి పంపిస్తే ఆ విషయాన్ని వక్రీకరిస్తూ కొంతమంది వైసీసీ నాయకులు సోషల్ మీడియా వేదికగా అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. మాదిగ సోదరులంటే చాలా అభిమానమని, కులాన్ని అడ్డుబెట్టుకుని బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలు చేయడం సరైనది కాదన్నారు. టీడీపీ హెచ్‌ఆర్‌డీ సభ్యుడు నేదునూరి వీర్రాజు మాట్లాడుతూ కూటమి నాయకులకు వస్తున్న ఆదరణను జీర్ణించుకోలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. మంద గాంధీ, మల్లవరపు వెంకన్నలు ఆ రోజు జరిగిన సంఘటనను వివరించారు. నేదునూరి పెద్దిరాజు, దిగుమర్తి చిట్టిబాబు, నేదునూరి పెద్దిరాజు పాల్గొన్నారు.

ట్రంప్ విధానాలు నిరసిస్తూ వామపక్షాల ధర్నా



అమలాపురంలో ధర్నా నిర్వహిస్తున్న వామపక్షాల నాయకులు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సుంకాల పేరుతో అమెరికా దేశాన్ని పదేపదే బెదిరిస్తున్నా ప్రధాని నరేంద్రమోదీ నోరు ఎత్తడం లేదని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి కొప్పుల సత్తిబాబు విమర్శించారు. సుంకాల పేరుతో అమెరికా చేస్తున్న పెత్తనాన్ని ఖండిస్తూ దేశ ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం గడియారస్తంభం సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. భారత్‌పై 50శాతం అదనపు టారిఫ్‌లు పెంచడం అన్యాయమని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ ట్రంప్‌కు దాసోహం కావడం వల్లే ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. ఇండియాను కించపరిచేలా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 40 సార్లు ప్రకటనలు చేసినా పార్లమెంటు సమావేశాల్లో గంటన్నర మాట్లాడిన మోదీ ఒక్కసారి కూడా ట్రంప్ ప్రకటనలను ఖండించలేదన్నారు. అటువంటి వ్యక్తి ప్రధానిగా ఉండడం దేశ దౌర్భాగ్యమన్నారు. ట్రంప్ విధానాలు నిరసిస్తూ అమెరికన్లే శ్వేత సౌధం వద్ద నిరసనలకు దిగుతున్న విషయాన్ని ప్రధాని మోదీ గుర్తెరగాలన్నారు. నిరసనలో వామపక్ష నాయకులు భీమాల శ్రీనివాస్, కె.శంకర్, జి.దైవమణి, పి.అలేఖ్య, కె.ఈశ్వర్, జి.రమణ, నాగరాజు, నాగబాబు, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజయభేతాళ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహిద్దాం

అంబాజీపేట, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అంబాజీపేటలో వేంచేసియున్న శ్రీవిజయభేతాళ స్వామి వారి ఉత్సవాన్ని అక్టోబరు 8న నిర్వహించనున్నట్లు శ్రీశెట్టిబలిజ అభ్యుదయ సంఘ అధ్యక్షుడు దొమ్మేటి వెంకటరామారావు, ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం సత్యఅర్జున రావు తెలిపారు. అంబాజీపేట సంఘ భవనంలో సమావేశం సంఘ కార్యదర్శి మట్టపర్తి రాము అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈసందర్భంగా ఈనెల22న మాచవరం రామ్ ఘాట్ నుంచి శ్రీవిజయభేతాళ స్వామి ఊరేగింపు జరుగుతుందన్నారు. కళశ స్థాపనకు 13 వాహనాలకు చెందిన కమిటీ సభ్యులు హాజరుకావాలని కోరారు. అలాగే ఉత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించేలా ఆయా కమిటీలు బాధ్యత వహించాలన్నారు. సమావేశంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు దొమ్మేటి శ్యామ్, బొంతు పెదబాబు, విత్తనాల శేఖర్, దొమ్మేటి సత్యమోహన్, మట్టపర్తి సోమేశ్వరరావు, దొమ్మేటి సాయికృష్ణ, గుత్తుల పండు, మట్టపర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియా వాడకంతో తగ్గుతోన్న సాగు ఖర్చు

ముమ్మిడివరం, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): నానో యూరియా ఎరువుల వాడకం వల్ల భూమి భౌతిక, రసాయన లక్షణాలు మెరుగుపడి సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చునని ఇఫ్కో జిల్లా మేనేజర్ జి.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. ఠాణేలంక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం, కొమానపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణలో ఆయా పీఏసీఎస్‌ల అధ్యక్షులు, చైర్‌పర్సన్లు గోదశి పుండరీష్, పొద్దోకు నారాయణరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. నానో ఎరువుల వాడకం వల్ల పంటకు పలు లాభాలు చేకూరుతాయన్నారు. ఇఫ్కో జిల్లా మేనేజర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికే అనేక గ్రామాల్లో నానో యూరియా పిచికారీ ట్రయల్స్ నిర్వహించామని, బస్తాకు సమానమైన నానోయూరియా కేవలం రూ.225, నానో డీఏపీ రూ.600 మాత్రమే ఖర్చు అవుతుందన్నారు. అలాగే ఇఫ్కో ప్రతీ ఎరువుల బస్తా లేదానానో బాటిల్ కొనుగోలుపై గరిష్ఠంగా రైతులకు రూ.2లక్షల వరకు బీమా ఉచితంగా వర్తిస్తుందన్నారు.నానో యూరియా ద్రవ రూప ఎరువుల వినియోగాన్ని పెంచాలన్నారు. పచ్చిరొట్ట ఎరువును సాగుచేసి పూత దశలో భూమిలో కలియ దున్నడం ద్వారా 25శాతం నత్రజని ఎరువుల మోతాదును తగ్గించుకోవచ్చునన్నారు. అవగాహన సదస్సుల్లో రైతులు, కూటమి నాయకులు, రైతు సేవాకేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

బూత్‌లెవెల్ అధికారులతో సమీక్ష

యానాం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిపాలనాధికారి కార్యాలయంలో బూత్‌లెవెల్ అధికారులతో ఆదివారం పరిపాలనాధికారి, యానాం ఓటర్ల నమోదు అధికారి అంకిత్‌కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. 2026లోబెంగాల్, తమిళనాడు, అస్సాం, కేరళ, కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఎన్నికలు జరగనున్నాయి. దీంతో 2002 ఓటర్ల జాబితాను ప్రస్తుత ఓటర్ల జాబితాతో పోల్చి పరిశీలిస్తున్నారు. 2002లో ఓటు ఉంటే ప్రస్తుతం ఏ బూత్‌లో ఓటు ఉందో నివేదికను సిద్ధం చేస్తున్నారు. నివేదికను పుదుచ్చేరి ప్రధాన ఎన్నికల అధికారికి పంపనున్నారు. డీటీ జ్యోతి వెంకటేశ్వరరావు, ముమ్మిడి శంకర్, సాదనాల బాబు, 33 పోలింగ్ బూత్ లెవిల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా.. కొరత లేదు

మండలాల్లో రైతులతో సమావేశాలు



పి.గన్నవరం: నరేంద్రపురంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఏడీ విజయకుమార్

పి.గన్నవరం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా 6,135 ఎకరాల వరి సాగుకు 320టన్నుల యూరియా అవసరమైతే ఇప్పటి వరకు 583.85 టన్నుల యూరియా వచ్చిందని పి.గన్నవరం సబ్‌డివిజన్ ఇన్‌చార్జి ఏడీఏ సీహెచ్‌డీ విజయకుమార్ తెలిపారు. పోతవరం, నరేంద్రపురం గ్రామాల్లో రైతులకు యూరియా సరఫరా, నానో యూరియా వాడకంపై ఆదివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో తహశీల్దార్ పి.శ్రీపల్లవితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో గ్రోమోర్ ఎరువుల కేంద్రంలో 19టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. నరేంద్రపురం, ఉడిమూడి సొసైటీలకు 41టన్నుల యూరియా వస్తుందన్నారు. సర్పంచ్‌లు వడలి కొండయ్య, బీర వెంగమాంబ, సొసైటీ అధ్యక్షుడు తోలేటి నారాయణమూర్తి, మట్టపర్తి వెంకటేశ్వర రావు, ఎంపీటీసీ పులపర్తి రాజారావు, రైతులు విల్ల నాగేశ్వరరావు, పప్పుల రామకృష్ణ, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన,(ఆంధ్రజ్యోతి): అమలాపురంఆర్డీవో మాధవి ఆధ్వర్యంలో ఆదివారం కాట్రేనికోనలో రైతు సమావేశం జరిగింది. సార్వాలో యూరియా కొరత లేదని అధికారులు వివరించారు. మండలంలో 4,200ఎకరాల్లో సార్వా సాగు జరిగిందన్నారు. దీనికి మూడు విడతలుగా 380టన్నుల యూరియా అవసరం కాగా 160టన్నులు ఇప్పటికే సరఫరా చేశామన్నారు. రెండు రోజుల్లో 50టన్నుల యూరియా అందుబాటులోకి వస్తుందన్నారు. రానున్న 10రోజుల్లో 160టన్నుల యూరియా సరఫరా చేస్తామన్నారు. వ్యవసాయాధికారిణి మృదుల, తహసీల్దార్ ఎమ్వీఎస్ సుబ్బలక్ష్మి, సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు అవసరం మేరకు యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయశాఖ అధికారిణి రమ్యప్రియాంక అన్నారు. గూడపల్లి, లక్కవరం గ్రామాల్లో యూరియాపై అవగాహన కల్పించారు. రైతులు నానో యూరియా వాడడం అలవాటు చేసుకోవాలన్నారు. రామరాజులంక సొసైటీ, లక్కవరంలో, మలికిపురంలో 33 టన్నుల యూరియా సిద్ధంగా ఉందన్నారు. యూరియా కోసం ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏవో చెప్పారు. అవగాహన సమావేశాల్లో స్థానిక రైతులు పాల్గొన్నారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో రైతులకు20టన్నుల యూరియా సిద్ధంగా ఉందని వ్యవసాయాధికారి రాకేష్ తెలిపారు. మండలంలో యూరియా కొరత లేదని, రైతులకు కావాల్సిన యూరియా సరఫరా చేయుటకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సఖినేటిపల్లి, రామేశ్వరం గ్రామాల్లో యూరియా లభ్యతపై ఫార్మర్ అవుట్రీచ్ కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి హర్షవర్ధన్, తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సఖినేటిపల్లి, రామేశ్వరం గ్రామాల సర్పంచ్, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏ విధమైన యూరియా కొరత లేదని మండల ప్రత్యేకాధికారి మధుసూదన్, వ్యవసాయాధికారి ఎన్వీవీ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం మామిడికుదురులో రైతులతో యూరియా నిల్వ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని, ఈదరాడ, మామిడికుదురు సొసైటీల ద్వారా యూరియాను రైతులకు విక్రయిస్తున్నట్టు తెలిపారు. ఈరెండు సొసైటీల్లో ప్రస్తుతం 40మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డీలర్ల వద్ద మరో 30మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. మొత్తం773మెట్రిక్ టన్నుల యూరియా అవసరం అవుతుందని, ఇప్పటికే 365మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించామని, మరో 70మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. సమావేశంలో ఆర్ఐ ఇబ్రహీం, రైతులు పాల్గొన్నారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): ఎరువుల కొరతపై రైతులు ఆందోళన చెందవద్దని యూరియా కొరత తీర్చడానికి ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టిందని తహశీల్దార్ వీవీఎల్ నరసింహారావు, మండల వ్యవసాయాధికారి కడలి విజయ్ అన్నారు. అల్లవరం, గూడాల సహకార సొసైటీల వద్ద రైతులతో సమావేశాలు నిర్వహించారు. మండలంలో వరిసాగుకు 210టన్నుల యూరియా అవసరమన్నారు. మండలంలో 2100ఎకరాల్లో ఖరీఫ్ వరిసాగు, 4వేల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతుందన్నారు. ఇప్పటివరకు 300టన్నుల యూరియా రాగా వరి, కొబ్బరికి వినియోగించారన్నారు. వరి సాగుకు 90టన్నుల యూరియా రావాల్సి ఉందని, 3,4 రోజుల్లో యూరియా రైతులకు అందజేస్తామన్నారు. అల్లవరం సర్పంచ్ బొమ్ము బాలవేణి, సహకార సొసైటీల అధ్యక్షులు పోలిశెట్టి భాస్కరరావు, కంకిపాటి గోపాలకృష్ణ, డిప్యూటీ తహశీల్దార్ అడపా సుబ్రహ్మణ్యేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

షోడశ సంస్కారాలతో మానవ జన్మ పరిపూర్ణం



పురోహిత పరిషత్ రజతోత్సవ సభలో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యశర్మ

అమలాపురం టౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): భారతీయ సనాతన జీవన విధానంలో షోడశ సంస్కారాలు ప్రధానమైనవని యనమండ్ర సుబ్రహ్మణ్యశర్మ పేర్కొన్నారు. షోడశ సంస్కారాలతో మానవ జన్మ పరిపూర్ణమవుతుందని స్మృతులు పేర్కొన్నాయన్నారు. అమలాపురం శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో ఆపస్తంబ పురోహిత పరిషత్ రజతోత్సవ సభ ఆదివారం ఈవని రామచంద్రసోమయాజి ఘనపాఠి అధ్యక్షతన నిర్వహించారు. తొలుత సంస్థ వ్యవస్థాపకులు తోపెల్ల రామం, శ్రీపాద కరుణేందుమౌళిల చిత్రపటాలకు, ఆపస్తంభ మహర్షి చిత్రపటానికి పూలమాలలువేసి సభను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా సుబ్రహ్మణ్యశర్మ మాట్లాడుతూ ప్రధానమైన సంస్కారాల విధివిధానాలను ప్రజలకు వివరిస్తూ క్రతువులు నిర్వహించాలని సూచించారు. జోతిష్య పండితులు చింతామణి సిద్ధాంతి మాట్లాడుతూ జోతిష్య పరమైన విశేష అంశాలను, ముహూర్తాల విశిష్టతను వివరించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 14మంది విద్యార్థులు స్మార్త పరీక్షలు రాయగా పరీక్షాధికారులుగా రాళ్లపల్లి సూర్యసుబ్రహ్మణ్యశర్మ, మంగిపూడి చైతన్యశర్మలు వ్యవహరించారు. పురోహితులకు వెండి ప్రతిమలను కానుకగా అందించారు. పురోహిత పరిషత్ కార్యదర్శి ఆకొండి పవన్, కోశాధికారి ఆకెళ్ల రాజబాబు, మరువాడ వెంకన్న, తోపెల్ల చంటి, కర్రా శివయ్య, మూల పల్లయ్య, పెద్దింటి కృష్ణ, కప్పగంతుల రాము, అనప్పిండి మూర్తి, తోపెల్ల కార్తీక్, పుత్సా కృష్ణకామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ప్రతీ మండలం నుంచి ఒక్కో పురోహితుడిని పరిషత్ తరపున సత్కరించారు.

హుస్సేనీ అసోసియేషన్ సేవలు అమూల్యమైనవి

మామిడికుదురు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): హుస్సేనీ ఎడ్యుకేషన్ అసోసియేషన్ అందిస్తున్న సేవలు అమూల్యమైనవని పలువురు వక్తలు కొనియాడారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో 25మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు వంద మంది విద్యార్థులకు రాత పుస్తకాలు, విద్యా సామగ్రిని అందించారు. మీర్జా ఖాదంహుస్సేన్, ఇలియాజ్‌హుస్సేన్, అబేద్ అలీ, సయ్యద్‌ఆగాహుస్సేన్, కల్బేమజిం ద్రేని, ఎంకే అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామిని దర్శించుకున్న పవర్ లిఫ్టింగ్ ఇండియా ఆర్గనైజింగ్ కార్యదర్శి

ఐ.పోలవరం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో మన దేశగౌరవాన్ని నిలబెట్టిన పవర్ లిఫ్టింగ్ ఇండియా ఆర్గనైజింగ్ కార్యదర్శి సకిలే కోటేశ్వరరావు ఆదివారం మురమళ్ళ వీరేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు వేద ఆశీర్వచనం అందించి, స్వామి చిత్రపటం, ప్రసాదంతో సత్కరించారు. కోనసీమ జిల్లాలో పవర్ లిఫ్టింగ్ గేమ్ ఉన్నతి కోసం పూర్తి సహకారం అందిస్తానన్నారు. ముమ్మిడివరం హెల్దీ లైఫ్ జిమ్ కోచ్ వాసంశెట్టి నరేష్ మాట్లాడుతూ పవర్ లిఫ్టింగ్ ద్వారా ఎంతో మందికి నేషనల్, ఇంటర్నేషనల్ స్థాయి మెడల్స్ అందించడమే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉద్యోగాలు ఇప్పించిన ఘనత కోటేశ్వరరావుకు దక్కుతుందన్నారు. ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు మద్ది ప్రభాకర్, శివ, గణేష్, దొమ్మేటి వేణుసాగర్, దాసరి వేదేశ్, మణికంఠ పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుల నిమజ్జనాలు

అంబాజీపేట, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలు ముగింపు సందర్భంగా గణనాథులను ఆదివారం నిమజ్జనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథులను మేళతాళ వాయిద్యాలతో పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం కౌశిక, గోదావరి నదుల్లో నిమజ్జనం చేశారు.

ఎమ్మెల్యే ఆనందరావుకు సత్కారం



అమలాపురంటౌన్, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా వెంకటాపురంలో పరిటాల రవీంద్ర స్వగృహానికి తొలిసారిగా ఎమ్మెల్యే అయి తా బత్తుల ఆనందరావు వెళ్లారు. ఈసందర్భంగా పరిటాల సునీత, కుమారుడు శ్రీరామ్ ఆధ్వర్యంలో ఆనందరావును దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

ఉత్తమ హెచ్ఎం రాణికి పౌర సన్మానం

అమలాపురం రూరల్, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): ఇందుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని లంకా రాణి ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాస్థాయి ఉత్తమ హెచ్ఎం అవార్డును అందుకోవడంతో గ్రామ సర్పంచ్ చొల్లంగి శివాలీనీ అప్పాజీ అధ్యక్షతన పౌర సన్మాన సభ నిర్వహించారు. రాణి సేవలను వక్తలు కొనియాడి దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. టీడీపీమండలశాఖ మాజీ అధ్యక్షుడు మల్లుల పోలయ్య, ఉపసర్పంచ్ హనుమాన్ బుజ్జి, బండి సర్వేశ్వరరావు, ఎస్ఎంసీకమిటీ సభ్యులు, గుబ్బల పెద్దిరాజు పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి హనుమాన్ బుజ్జి రూ.10,116, బండి సర్వేశ్వరరావు రూ.5వేలు, వీరబ్రహ్మంరూ.2వేలువిరాళం అందించగా, గణితఉపాధ్యాయుడు టి.త్రిమూర్తులు షెడ్డునిర్మాణానికి ఖర్చును ఇస్తానని ప్రకటించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

ముమ్మిడివరం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన వారిని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ ఘనంగా సత్కరించింది. మండలం ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన మోర్త రాజశేఖర్, వి.చినరాజశేఖర్, ఎం.నాగభూషణంలను ముమ్మిడివరంలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్.మునేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్ జీవీవీ సత్యనారాయణ, జి.వెంకటేశ్వరరావులు పూలమాలలు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

కాటన్ విగ్రహం ఏర్పాటుకు చర్యలు

ఐ.పోలవరం, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి):పశువుల్లంక వద్ద కాటన్ విగ్రహం ఏర్పాటుచేసే స్థలాన్ని ఆదివారం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పరిశీలించారు. దాత సహకారంతో 11అడుగుల ఎత్తున గుర్రంపైస్వారీ చేసే కాటన్ ఫైబర్ విగ్రహాన్ని అక్విడెక్టు వద్ద ఏర్పాటు చేయనున్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, ధూళిపూడి చక్రం, జంపన బాబు, ధూళిపూడి త్రిమూర్తులు, ధూళిపూడి పెద్దకాపు ఉన్నారు.

'అన్నదాత' పోరు పోస్టర్ ఆవిష్కరణ

అమలాపురంరూరల్, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): వైసీపీఅధినేత జగన్ ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల9న అన్నదాతకు అండగా వైసీపీ పోరు చేపడతామని అమలాపురంఅసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ పేర్కొన్నారు.భట్నవిల్లిలో మాజీమంత్రి పినిపే విశ్వరూప్ స్వగృహం వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణరావు పిలుపునిచ్చారు. రాష్ట్ర, జిల్లా నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, సరెళ్ల రామకృష్ణ, కుడుపూడి భరత్‌భూషణ్ పాల్గొన్నారు.

విద్యా ప్రోత్సాహకాల పంపిణీ

అమలాపురం టౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లయన్స్ సెంటీనియల్ విద్యా ప్రోత్సాహక ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. అమలాపురం దుడ్డువారి అగ్రహారంలోని బులియన్ అసోసియేషన్ భవనంలో శేర్ అనిల్‌కుమార్‌జైన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి విద్యా ప్రోత్సాహక ట్రస్టు చైర్మన్ బీవీఎన్ రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. పేద విద్యార్థుల కోసం రూ.1.29కోట్ల కార్పస్ ఫండ్‌ను సేకరించి 106మంది ట్రస్టు సభ్యులతో ఏటా విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్పస్ ఫండ్‌పై వచ్చే వడ్డీని పేద విద్యార్థులకు ఉపకార వేతనాలుగా అందిస్తున్నామని చెప్పారు. 80మంది విద్యార్థుల్లో పలువురికి ల్యాప్‌టాప్‌లతో పాటు ఉపకార వేతనాలు అందజేశారు. ట్రస్టు కార్యదర్శి పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు, కోశాధికారి డి.రమాసుబ్రహ్మణ్యం, బాదం బాలకృష్ణ, చిట్టినీడిశ్రీనివాసరావు, మంజులూరి విశ్వేశ్వరరావు, లింగమల్లు కృష్ణమూర్తి, అమలాపురం క్లబ్ అధ్యక్షుడు సూదా గణపతి, పూర్వపు అధ్యక్షుడు రవణం వేణుగోపాలరావు, సుగ్గు గోపి, జంపన సుమన్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

మురమళ్ళ వీరేశ్వరస్వామి సన్నిధిలో చండీ హోమం

ఐ.పోలవరం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ శ్రీభద్రకాళీసమేత వీరేశ్వరస్వామి సన్నిధిలో ఆదివారం చండీ హోమం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో గణపతి పూజ, మండపారాధన, అనంతరం చండీహోమం నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమీషనర్ వి.సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆకొండి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆక్వా కల్చర్ డైరెక్టర్ శ్రీనివాస్

ఐ.పోలవరం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ విత్తనాల నాగశ్రీనివాస్ ఆదివారం ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీత శ్రీనుకు సన్మానం

మామిడికుదురు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సామాజిక విప్లవ యోధుడు, అంబేడ్కర్ వాది నల్లి శ్రీనివాస్ అని పలువురు వక్తలు కొనియాడారు. సామాజిక అంశాలపై చేసిన పోరాటాలను గుర్తించి ఆయనకు అంతర్జాతీయ అవార్డు వచ్చిందని మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి కొనియాడారు. టొలాసో మెక్సికో యూనివర్శిటీ (అమెరికా) ఇటీవల శ్రీనివాస్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ అవార్డును అందించింది. ఈసందర్భంగా ఈదరాడ గ్రామంలో శ్రీనివాస్ దంపతులను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూనివర్శిటీ కోఆర్డినేటర్ కె.శంకర్, న్యాయవాది సరెళ్ల ఆనందశాస్త్రి, బత్తుల రాము, బొంతు మణిరాజు, నూటుకుర్తిన త్యనారాయణ, కలిగితి పల్లంరాజు, బత్తుల జనార్ధనరావు, చింతా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

అంతర్వేది, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): గుడిమూల గ్రామంలో ఉదయం 10.30గంటలకు రూ.4కోట్లతో నిర్మించిన 33/11 కేవీ ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్‌ను సోమవారం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రారంభించనున్నట్టు ఏఈ బి.ప్రసాద్ తెలిపారు. సఖినేటిపల్లి, అంతర్వేదితో పాటు గుడిమూలలో కూడా సబ్‌స్టేషన్ ఏర్పాటుతో లోఓల్టేజ్ సమస్యలు తీరతాయని ఆయన తెలిపారు.

ఆలయాలు మూసివేత



ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయానికి తాళం వేస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి):చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని మండలంలో ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ప్రముఖ దేవాలయాలన్నింటినీ మూసివేశారు. ఈఆలయాలను సోమవారం సంప్రోక్షణ అనంతరం తిరిగి తెరుస్తామని ఆలయాలపండితులు తెలిపారు. సోమవారం ఉదయంయథావిధిగా దర్శనాలు ఉంటాయన్నారు.

అంబాజీపేట,(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం సందర్భంగా మండలంలోని ఏకాదశ రుద్రుల ఆలయాలతో పాటు ప్రముఖ ఆలయాలు ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేశారు. సోమవారంసంప్రోక్షణ అనంతరం ఆలయాలను తెరుస్తామని అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీస్వామి ఆలయాన్ని సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా మహానైవేద్యం, నివేదన అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు ఆలయాన్ని మూసివేశారు. ఆలయ అర్చకులు, ఉద్యోగులు ఆలయ ప్రధాన ద్వారానికి తాళం వేశారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం ఆలయంలో దర్శనాలు ప్రారంభమవుతాయని, సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అధ్యాపకులకు శిక్షణ

అమలాపురం రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యారంగంలో ఎప్పటికప్పుడు మారుతోన్న ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని అధ్యాపకులు అంది పుచ్చుకోవాలని రూర్కీ ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ అవిక్‌భట్టాచార్య పేర్కొన్నారు. భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్నోవేషన్స్ ఇన్ ఎనర్జీ సొసైటీ అనే అంశంపై ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో ఆరు రోజుల పాటు నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఆదివారంతో ముగిసింది. అటల్, ఏఐసీటీఈ ప్రయోజిత కార్యక్రమంలో ఐఐటీ, నిట్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల ప్రొఫెసర్లు, నిపుణులు అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఏఐసీటీఈ గుర్తింపు పొందిన కళాశాలల అధ్యాపకులు శిక్షణలో పాల్గొన్నారు. విద్యుత్‌రంగంలో సాంకేతిక పురోగతిని డాక్టర్ భట్టాచార్య వివరించారు. విద్యుత్‌రంగంలో సవాళ్లను ఎదుర్కొనే విధానాన్ని పాటియాలాప్రొఫెసర్ డాక్టర్ ముకేష్ సింగ్ తెలిపారు. విజ్ఞాన వినిమయంలో అంతర్జాతీయ పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకోవాలని చాగంటి మైథిలి వివరించారు. విద్యుత్ రంగంలో రానున్న కొత్త ఇన్నోవేషన్ల ప్రాముఖ్యతను నిట్ అసోసియేట్ ప్రొఫెసర్ టి.నవినయ్‌కుమార్ తెలిపారు. విద్యుత్‌విద్యార్థులకు పరిశోధనల్లో నూతనమార్గాలను కేఎల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ ఏ.పాండ్యన్ బోధించారు. ఈఈఈ హెడ్ ఏఎన్‌వీజే రాజగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ దీపాంకర్, దేబ్‌నాథ్, కేవీ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ గుడే శ్రీహరి, అనేక అంశాలను వివరించగా ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజే రామారావు, ప్రొఫెసర్ బి.ముత్తువేల్, గంగాభవానీ, పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.

కురిసిన వర్షం

మలికిపురం, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం ఉదయం వర్షం పడింది. ఇటీవల వర్షాలు లేక వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరిగి మార్పులు చేటుచేసుకోవడంతో వర్షానికి ప్రజలు సేద దీరారు. రైతులు కొబ్బరిచెట్లకు మందులు పెట్టేపనిలో నిమగ్నమయ్యారు.

ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ హనుమంతరావుకు అవార్డు

ముమ్మిడివరం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్, డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ, ముమ్మిడివరం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీర హనుమంతరావుకు సర్వేపల్లి రాధాకృష్ణ ఇన్స్పిరేషన్ అవార్డు లభించింది. రాజమహేంద్రవరం పాన్ ఇండియన్ సోషల్ కల్చర్ అసోసియేషన్ ఈ అవార్డును ప్రదానం చేసింది. రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో పూర్వ జడ్పీ సీఈవో ఎన్వీ సత్యనారాయణ, ఉండవల్లి అరుణ్‌కుమార్, బొర్రా గోపీమూర్తిలు హనుమంతరావును పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి ఈఅవార్డును ప్రదానం చేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో జిల్లా రెండోస్థానం సాధించడంలో విశేష కృషి చేశారని వక్తలు పేర్కొన్నారు.

ఆదుకోవాలంటూ ఆటో డ్రైవర్ల నిరసన

అల్లవరం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని కొమరగిరిపట్నం సెంటర్‌లో ఆటోడ్రైవర్లు ఆదివారం నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణాలు కల్పించడం వల్ల తాము జీవనోపాధి కోల్పోయి తమ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ఓడలరేవు, మొగళ్లమూరు, కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన ఆటో యూనియన్లు నిరసనలో పాల్గొన్నాయి. ఆటో యూనియన్ అధ్యక్షుడు చేగొండి పెద్దిరాజు, కొల్లూరి శ్రీను, చిట్టూరి వెంకటేశ్వరరావు, కామేష్, యల్లమిల్లిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలుపు మందు తాగి వ్యక్తి మృతి

అంబాజీపేట, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): కలుపు మం దు దంగేటి సోమేశ్వరరావు(44) ఆదివారం మృతిచెందాడు. స్థానికంగా ఉన్న ఓ కొబ్బరితోటలో కలుపు మందు సేవించాడు. దీంతో కుటుంబ సభ్యులు అతడ్ని అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. సోమేష్ ఓ చానెల్, ఓ దినపత్రికలో పనిచేస్తున్నాడు. అతడి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

యానాం, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): యానాంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్ధాని దినేష్,నాయకుడు కాటంశెట్టి రామ్మూర్తి ఆధ్వర్యంలో కాకినాడ శ్రీకిరణ్ కంటిఆసుపత్రి సౌజన్యంలో ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు ప్రత్యూష వైద్య సేవలందించారు. 200మందికి పరీక్షలు నిర్వహించారు. 60మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నారు. చెక్కల అరుణ్‌కుమార్, తిరుకోటి రాజు ఆదిమూర్తి, రాజు పాల్గొన్నారు.

చాకలిపాలెంలో గణపతి లడ్డూ వేలం

పి.గన్నవరం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): చాకలిపాలెం సెంటర్‌లో వేంచేసి ఉన్న వరసిద్ధి వినాయకుని ఆలయంలో శనివారం రాత్రి లడ్డూ వేలం నిర్వహించారు. స్థానికుడు పితాని రారాజు రూ.15వేలకు లడ్డూను దక్కించుకున్నారు.అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్థానిక నాయకులు పత్తిపాటి వెంకన్నబాబు, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

ముమ్మిడివరం, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన వారిని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ ఘనంగా సత్కరించింది. మోర్త రాజశేఖర్, వి.చినరాజశేఖర్, ఎం.నాగభూషణంలను ముమ్మిడివరంలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లాఅధ్యక్షుడు ఎస్ఎన్.మునేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్ జీవీవీ సత్యనారాయణ, జి.వెంకటేశ్వరరావులు పూలమాలలతో సత్కరించారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి సుభాష్

కె.గంగవరం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రాధాన్యతలు అని మంత్రి సుభాష్ అన్నారు. ఆదివారం దంగేరులో నిర్మించిన సీసీ రోడ్లు మంత్రి ప్రారంభించారు. ప్రభుత్వం గ్రామాలకు అవసరమైన మౌలిక వసతులను సమకూరుస్తుందన్నారు. రూ.125 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశామని, అభివృద్ధి నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నిర్మించిన పలు రోడ్లను మంత్రి ప్రారంభించారు.



దంగేరులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్





పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక అలంకరణలో విజయదుర్గ అమ్మవారు. పక్క చిత్రంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

విజయదుర్గా పీఠంలో ప్రత్యేక పూజలు

రాయవరం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో బాద్రపద పౌర్ణమి పూజలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు జరిపి ప్రత్యేక అలంకరణ చేశారు. తొలుత విజయ వేంకటేశ్వర స్వామికి సుప్రభాతసేవ, తులసిదళ అర్చనలు చేశారు. అనంతరం విజయదుర్గ అమ్మవారికి పలు అష్టోత్తరాలతో పాటు కుంకుమ పూజలు , భవాని శంకర సమేత అష్టలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం చేశారు. ఈసందర్భంగా పీఠాధిపతి గాడ్ భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ వీవీబాపిరాజు, విజయదుర్గ సేవా సమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్య వెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, బుజ్జి, వీఆర్వో బాబి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆలయం మూసివేత: చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకుని విజయదుర్గా పీఠాన్ని సోమవారం ఉదయం వరకు మూసివేస్తున్నట్లు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. సంప్రోక్షణల అనంతరం సోమవారం ఉదయం దర్శనాలకు అనుమతిస్తామన్నారు. హోమం సమయంలో అమ్మవారికి పరివార దేవతలకు నవగ్రహ, నక్షత్రాలకు సర్వారిష్ట నివారణార్థం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి కృష్ణాజిల్లా కంకిపాడుకు చెందిన పి.కృష్ణారావు, జాన్సీరాణి దంపతులు రూ.1,01,116 విరాళాన్ని ఇచ్చారు. దాతలకు ఆలయ సిబ్బంది స్వామి వారి చిత్రపటం అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తజ నం స్వామి వారి ప్రసాదంలో పాల్గొన్నారు. ఆలయంలో చేపడుతున్న ఆయా అభివృద్ధి పనులను ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పరిశీలించారు.



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం



రాయవరం మండలం వెదురుపాకలో వినాయకుడికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



ఆలమూరులో జరిగిన భరతనాట్య ప్రదర్శనలో ప్రతిభ కనబర్చిన చిన్నారులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

కొనసాగిన వినాయక నిమజ్జనాలు

రాయవరం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా ప్రాంతాల్లో గణేష్ నిమజ్జనాలు రెండో రోజు ఆదివారం కూడా కొనసాగాయి. వెదురుపాక సపటా సెంటర్‌లో ఉన్న లక్ష్మీగణపతి మండపం వద్ద నుంచి ప్రత్యేక వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించడంతో పాటు వినాయకుడికి పల్లకీ ఉత్సవం నిర్వహించారు. వెదురుపాక రజకుల వీధిలో వినాయకుడి నిమజ్జనాన్ని రజక సంఘం ఆధ్వర్యంలో జరిపారు. వెదురుపాక మార్కెట్ సెంటర్‌లో వినాయకుడికి గ్రామోత్సవం జరిపి నిమజ్జనం చేశారు. రాయవరం ఎస్ఐ డి.సురేష్ బాబు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేసి నిమజ్జనాలు జరిగేలా చర్యలు తీసుకున్నారు.

ఉత్సాహంగా ఊరేగింపులు

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో రెండో రోజు ఆదివారం కూడా గణేష్ నిమజ్జనాలు జరిగాయి. ఆలమూరు గణపతి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ మట్టి గణపయ్యను ప్రత్యేక వాహనంలో గ్రామంలో ఊరేగించి కాలువ వద్ద నిమజ్జనం చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను భారీ ఊరేగింపుల మధ్య కాలువలు, గోదావరిలో నిమజ్జనాలు చేశారు. ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ అధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు: గణపతి నవ రాత్రి ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఆల మూరు పసుపులేటిగూడెంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఏర్పాటు చేసిన భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతులు, జ్ఞాపికలను అందించి పలువురు నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు అభినందించారు.



బాధితురాలికి ఆర్థికసాయం అందిస్తున్న అమ్మా సీతమ్మ సేవా సమితి సభ్యులు

బాధితురాలికి ఆర్థికసాయం

రావులపాలెం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రావులపాలానికి చెందిన పి.సరస్వతి అనారోగ్య సమస్యతో బాధపడుతూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది. తెలుసుకున్న అమ్మా సీతమ్మ సేవా సంస్థ సభ్యులు సానబోయిన బాలాజీ ఆధ్వర్యంలో ఆమె ఇంటికి వెళ్లి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో చింతా రావుయాదవ్, సానబోయిన బుజ్జి, శ్రీకాంత్, రామకృష్ణ, మోటూరి శ్రీను, పితాని శివ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో మహేశ్వరరావుకు పదోన్నతి



రావులపాలెం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ఎంపీడీవోగా పనిచేస్తున్న ఈ.మహేశ్వరరావుకు ఏపీడీగా పదోన్నతి లభించింది. ఆయనను పి.గన్నవరం డివిజన్ డ్వామా ఏపీడీగా నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

ఎమ్మెల్యేను కలసిన నూతన పాలకవర్గం

ఆలమూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయ నూతన పాలకవర్గం నియమించడంతో నూత న పాలకవర్గం ఆదివారం ఎమ్మెల్యే బండా రును కలసి కృతజ్ఞతలు తెలిపారు. నూతన పాలకవర్గ చైర్మన్‌గా నియమితులైన వీరి అప్పారావుతోపాటు పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు, కూటమి నాయకులు ఎమ్మెల్యే బండారును సత్కరించారు. కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్‌ను కలసి పాలకవర్గం సత్కరించారు.



చింతలూరు నూకాంబిక ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులతో ఎమ్మెల్యే బండారు

ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

రావులపాలెం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రావులపాలెం కాపు కల్యాణ మండపం వద్ద రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. దీనికి జడ్పీ బాలుర పాఠశాల చైర్మన్ నందం వీరవెంకట సత్యనారాయణ, బాలికల పాఠశాల చైర్మన్ కోట సోమేష్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు, జిల్లా కార్యదర్శి వైవీఎస్ఎన్ బాలాజీతో పాటు ఉమ్మడి జిల్లా జేఏసీ అధ్యక్షులు రాఘవులు తదితరులు పాల్గొని ఉపాధ్యాయులను సత్కరించి అవార్డులను అందజేశారు.

ఎంపీపీ వాసు సస్పెన్షన్

మండపేట, సెప్టెంబరు, 7 (ఆంధ్రజ్యోతి): మండపేట మండల ఎంపీపీ ఉండమట్ల వాసు వైసీపీ నుంచి ఎంపీపీగా ఎంపికై పార్టీకి వెన్నుపోటు పొడిచినందుకు పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నామని అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. మండపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లా డారు. పార్టీలో అధికారంలో ఉండగా పదవి అనుభవించి ఇప్పుడు పార్టీకి ద్రోహం చేసిన ఎంపీపీ వాసును పార్టీశ్రేణులు తప్పుపట్టారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడు తున్న వాసుపై చర్య తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

యూరియా కొరత లేదు

• రైతులతో అధికారుల సమీక్ష • వదంతులు నమ్మవద్దని హితవు

ఆలమూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): యూరియా కొరత ఉన్నట్టు జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని యూరియా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉందని అధికారులు అన్నారు. ఆలమూరు మండలం పెదపళ్ల, చింతలూరు సహకార సంఘాల పరిధిలో ఆదివారం రైతులతో తహశీల్దార్ కెజె.ప్రకాష్‌బాబు, అగ్రికల్చర్ ఏవో మీనా, చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు, చింతలూరు సహకార సంఘం అధ్యక్షుడు నల్లా వెంకన్న తదితరులు రైతులతో సమీక్ష జరిపారు. సహకార సంఘాల్లో యూరియాతోపాటు ఇతర ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఎవరికి ఎన్ని కావాలన్నా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. యూరియా కొరత ఉన్నట్లు చేస్తున్న ప్రచారంలో నిజం లేదని చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు అన్నారు.

రావులపాలెం,(ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని తహశీల్దారు ముక్తేశ్వరరావు అన్నారు. రావులపాలెం మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో ఆదివారం అధికారులు రైతులతో సమావేశం నిర్వహించారు. తహశీల్దారు ముక్తేశ్వరరావు, ఆలమూరు ఏడీఏ సీహెచ్‌కేవీ చౌదరి, ఏవో లావణ్య పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎరువులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ప్రస్తుతం గోపాలపురంలో 10, పొడగట్లపల్లిలో 10 మొత్తం 20 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు.



మండపేట మండలం ఏడిద సహకార సంఘంలో యూరియా నిల్వలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

రైతులకు సరిపడా యూరియా

ద్రాక్షారామ, (ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, రెండు రోజుల్లో మరో 30వేల మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని రామచంద్రపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్ తెలిపారు. రామచంద్రపురం మండలం వేగాయమ్మపేట, తోటపేట, చోడవరం, అన్నాయిపేట గ్రామాల్లో రైతులకు యూరియా లభ్యతపై అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో రిష్వంత్‌రాయ్ మాట్లాడుతూ ఎటువంటి ప్రచారాలు నమ్మవద్దని కోరారు. రెండు రోజుల్లో 30 వేల మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని ఆర్‌బీకే, పీఏసీసీఎస్‌ల ద్వారా రైతులకు అందజేస్తామన్నారు. ఏడీఏ బి.నాగకుమార్ మాట్లాడుతూ యూరియా కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. వేగాయమ్మపేట లో జరిగిన సమావేశంలో సర్పంచ్ అంబటి తుకారాం, పీఏసీసీఎస్ త్రీమెన్ కమిటీ చైర్మన్ మేకా జానకి రామయ్య, మండల ప్రత్యేకాధికారి టి.నాగలక్ష్మి, తహసీల్దార్ మృత్యుంజయరావు, ఎంపీవో మణిదీప్, ఎంపీవోడీఆర్‌సి మనోహర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

మండపేట, (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వాటి నిల్వలు సమృద్ధిగా వున్నాయని మండపేట మండల వ్యవసాయాధికారి ప్రభాకర్ చెప్పారు. యూరియా కొరత అంటూ వస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దని రైతులకు ఆయన సూచించారు. యూరియా కొరతపై రెవెన్యూ, వ్యవసాయశాఖ సంయుక్తంగా మండలంలో రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని ఏడిద, మారేడుబాక గ్రామాల్లో ఆదివారం వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సమావేశాన్ని నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఏడిద సహకార సంఘంలో వున్న ఎరువుల నిల్వలను మండల తహసీల్దార్ టీ.తేజేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి ప్రభాకర్ పరిశీలించారు. గ్రామాల వారీగా కేటాయించిన యూరియా వివరాలను ఏవో ప్రభాకర్, తహసీల్దార్ తేజేశ్వరరావు వివరించారు. మండలానికి కేటాయించిన యూరియాను స్థానిక రైతులకు మాత్రమే విక్రయించాలని వ్యాపారులను కోరారు. సమావేశంలో సహకార సంఘాల అధ్యక్షులు, సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామిని దర్శించుకున్న పవర్ లిఫ్టింగ్ ఇండియా ఆర్గనైజింగ్ కార్యదర్శి

ఐ.పోలవరం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో దేశగౌరవాన్ని నిలబెట్టిన పవర్ లిఫ్టింగ్ ఇండియా ఆర్గనైజింగ్ కార్యదర్శి సకిలే కోటేశ్వరరావు ఆదివారం మురమళ్ల వీరేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయనకు స్వామి చిత్రపటం, ప్రసాదంతో సత్కరించారు.

అవినీతికి తావులేకుండా కూటమి పాలన

రాయవరం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో అవినీతికి తావు లేకుండా అధికారులు ప్రజలకు సేవలు అందిస్తున్నారని టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజు అన్నారు. ఆదివారం చెల్లూరులో ఆయన మాట్లాడారు. రెవెన్యూ శాఖలో కాసులు ఇవ్వనిదే ఏపని జరగడం లేదంటూ కొంతమంది అసత్య ప్రచారం చేయడాన్ని ఖండించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొంత మంది ఇటువంటి ప్రచారం చేస్తున్నారన్నారు.

పురోహితుడికి ఆర్థికసాయం

ద్రాక్షారామ, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పురోహితుడు కావుటూరి సీతారామ్‌కు మంత్రి సుభాష్ రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. సీతారాం కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వేదం నేర్చుకుంటున్న అతని కుమారుడు అఖిల్‌ను భీమేశ్వరాలయంలో పనికి పెట్టారు. ప్రతినెలా రూ.10 వేలు ఆర్థికసాయం అందజేస్తానని మంత్రి వారి కుటుంబానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అగస్త్యేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చెరుకుపల్లి గణేష్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.



మూసివేసిన కోటిపల్లి సోమేశ్వరాలయం



కొత్తపేటలో శనేశ్వర ఆలయాన్ని మూసివేసిన దృశ్యం



మండపేటలో అగస్త్యేశ్వర జనార్దనస్వామివారి ఆలయానికి తాళాలు వేస్తున్న దేవాలయ సిబ్బంది

చంద్రగ్రహణంతో ఆలయాలకు తాళాలు

కె.గంగవరం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని ఆదివారం మధ్యాహ్నం కోటిపల్లి చాయాసోమేశ్వరస్వామి ఆలయాన్ని మూసివేశారు. సోమవారం మహా సంప్రోక్షణ అనంతరం ఆలయాన్ని తెరుస్తామని సిబ్బంది తెలిపారు. అనంతరం దర్శనాలకు అనుమతిస్తామని కార్యనిర్వహణాధికారి జొన్నాడ భీమశంకరం తెలిపారు.

శనేశ్వర ఆలయం మూసివేత

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం సందర్భంగా మందపల్లి శనేశ్వరస్వామి ఆలయాన్ని ప్రధాన అర్చకుడు ఐలూరి శ్రీరామమూర్తి, వేద పండితుల పర్యవేక్షణలో ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం ఉదయం 8 గంటలకు ఆలయాన్ని తెరవనున్నట్టు ఆలయ సహాయ కమిషనర్, ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు. అనంతరం తైలాభిషేకాలు, దర్శనాలు ప్రారంభం అవుతాయని ఈవో తెలిపారు.

మండపేట, (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం నేపథ్యంలో పట్టణంలోని పలు దేవాలయాలను మూసివేశారు. ఆదివారం మధ్యాహ్నమే ఆలయాలకు తాళాలు వేశారు. మండపేటలో రథం గుడి, కేపీ రోడ్డులో వున్న వేంకటేశ్వరస్వామి దేవాలయంతోపాటు పట్టణంలోని ఆయా ఆలయాలను మూసివేశారు. మండలంలోని అయ్యప్పస్వామి ఆలయాన్ని కూడా మూసివేశారు. సోమవారం సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో రవి

నానో ఎరువులతో అధిక లాభాలు

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నానో ఎరువులు వినియోగించడం ద్వారా రైతులకు ఖర్చు తగ్గి అధిక లాభాలు పొందవచ్చని తహసీల్దార్ జి.శ్రీనివాస్, ఏవో బి.రవి అన్నారు. ఆదివారం మండలంలోని నేలటూరు, నిడసనమెట్ట, వడ్లమూరు గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. యూరియా అందుబాటులో ఉందని రైతులు కంగారు పడాల్సిన అవసరం లేదని తెలిపారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల రైతులు, గ్రామస్థులు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులకు టార్పాలిన్స్ పంపిణీ

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురంలో గ్రామానికి చెందిన కొరపాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం రైతులకు టార్పాలిన్స్ పంపిణీ చేశారు. వర్షాల వల్ల ఇబ్బందులు పడే రైతులకు ఇవి ఎంతో ఉపయోగపడతాయన్నారు. తానా చేసే ఇలాంటి సేవా కార్యక్రమాలు రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని వక్తలన్నారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

చింతలూరు నూకాంబిక ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్‌గా అప్పారావు

ఆలమూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయ నూతన పాలకవర్గం నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ ధార్మిక పరిషత్ కార్యదర్శి కె.రామచంద్ర మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ నూతన ట్రస్టుబోర్డు చైర్మన్‌గా వీరి అప్పారావు, డైరెక్టర్లుగా గన్ని వెంకట్రావు, అత్తిలి దుర్గమ్మ, నందూరి మోహన్‌సుభాష్, చర్ల పుష్పవల్లి, కాలా సూరిబాబు, నంగడి శ్రీదేవి, పూడూరి శ్రీనివాస్, వెల్ల మంగయమ్మ, పలుపులేటి వీరబాబు, కడలి సత్యవతి, అర్చకుల నుంచి లేగా శ్రీనివాస్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నూతన పాలకవర్గ చైర్మన్‌గా నియమితులైన అప్పారావుతోపాటు డైరెక్టర్లు పలువురు అభినందించారు.

తెలుగు యువత అధ్యక్షుడిగా శ్రీనివాస్

ఆలమూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కొత్తపేట నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడిగా జొన్నాడకు చెందిన భావన శ్రీనివాస్‌ను నియమించారు. తెలుగుదేశం కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే ఆయనకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. పార్టీకి విధేయుడిగా పనిచేసిన ఆయనకు సముచిత స్థానం లభించినట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆయన్ను తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఈదల సత్తిబాబు, సలాది నాగేశ్వరరావులుతోపాటు పలువురు నాయకులు అభినందించారు.

యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దు

మండపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని రైతులు యూరియా కోసం ఆందోళన చెందనవసం లేదని పలువురు సహకార సంఘాల అధ్యక్షులు తెలిపారు. మండపేటలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేశవరం, ఏడిద, తాపేశ్వరం, జెడ్.మేడపాడు సహకార సంఘాల అధ్యక్షులు ఉండమట్ల శ్రీనువాస్, గొడవర్తి సత్యనారాయణ, పడాల రామకృష్ణారెడ్డి, సలాది బాల సుబ్రహ్మణ్యం మాట్లాడారు. వైసీపీ నాయకులు యూరియా కొరత పేరిట నాటకాలాడుతున్నారన్నారు. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. రైతులకు ఎంత యూరియా కావాలన్నా అందించేందుకు సిద్ధంగా వున్నామన్నారు. వైసీపీ నాయకులు చేస్తున్న యూరియా కొరత దుష్ప్రచారాన్ని రైతులు నమ్మవద్దని తెలిపారు.



మాట్లాడుతున్న సహకార సంఘాల అధ్యక్షులు

జనవిజ్ఞాన వేదిక జిల్లా నూతన కార్యవర్గం

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక నూతన కార్య వర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. జనవిజ్ఞాన వేదిక అంబేడ్కర్ కోనసీమ జిల్లా మహాసభ స్థానిక చెలికాని రామారావు స్మారక మందిరంలో జరిగింది. ముందుగా జాతీయ పతాకా న్ని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు డాక్టర్ చల్లా రవికుమార్ ఆవిష్కరించగా జేవీవీ పతాకాన్ని పట్టణ అధ్యక్షుడు ఉప్పలపాటి మాచిరాజు ఆవిష్కరించారు. అనంతరం జిల్లా తాత్కాలిక అధ్యక్షుడు జనిపల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, చల్లా రవికుమార్ తదిత రులు మాట్లాడారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా మాజీ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, డాక్టర్ చెలికాని స్టాలిన్, డాక్టర్ చల్లా రవికుమార్, డాక్టర్ ఇ.ఆర్ సుబ్రహ్మణ్యం, జిల్లా అధ్యక్షుడిగా జనుపల్లి సత్యనారాయణ, కార్యదర్శిగా పీవీవీ ప్రసాద్, కోశాధికారిగా కేవీవీ సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా ఎండి కాజామొహిద్దీన్, చింతా శ్యాం సుందర్, రేలా వెంకటేశ్వరరావు, కార్యదర్శులుగా పెదపాటి నరసింహారావు, జి.స్వామి ప్రసాద్, జి.త్రినాద్ ఎన్నికయ్యారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం



సన్మానిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైంది

మండపేట, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) సమాజంలో గౌరవ ప్రదమైన వృత్తి ఉపాధ్యాయవృత్తి అని ఎమ్మెల్సీ బొర్రా గోపి అన్నారు. రాజమహేంద్రవరంలో పాన్ ఇండియా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులకు అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. మండపేట మండలం వెలగతోడు జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు తన సొంత నిధులతో పాఠశాలకు రంగులు వేయించి విద్యాబివృద్ధికి చేసిన కృషి అభినందనీయమని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, ఎమ్మెల్సీ బొర్రా గోపి అన్నారు. ఉత్తమ విద్యాబోధనలు చేస్తున్న శొంటి శ్రీనివాసరావు సేవలను వారు ప్రసంసించారు. ఉత్తమ సేవలందించే ఉపాధ్యాయులను గౌరవించే పాన్ ఇండియా సంస్థను వారు కొనియాడారు. ఈ సంస్థ అందించిన అవార్డును నేతలు చేతుల మీదుగా శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, ఉపా ధ్యాయ సంఘాల ప్రతినిధులు, పాన్ ఇండియా ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

మండపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి తాతారావు సారధ్యంలో కేశవరంనకు చెందిన వైసీపీ కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే వేగుళ్ల పార్టీ కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చంద్రమళ్ల యేసయ్య, బాబి, క్రాంతి, బాపిరాజు, పవన్, జయకర్ అనిల్, పాప, శ్రీదేవి, పోసియ్య, కమలాకరావు, పనస రామన్నతోపాటు పలువురు పార్టీలో చేరారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు ఎన్.వీర్రెడ్డి, వాదా ప్రసాదరావు, తదితరులు వున్నారు.



ఎమ్మెల్యే వేగుళ్ల సమక్షంలో టీడీపీలో చేరిన దృశ్యం